# వనవాలి



## మల్లాది రామకృష్ణశాస్త్రి

పచ్చని మాని క్రింద, వెచ్చని నీడలో, ముచ్చటగ కొలువున్న గంగవ్వా! మండుటెండలో పండుతల్లివై, మాపటి పొద్దుల నిండుతల్లివై, అన్నివేళలా దండితల్లివై ఉన్నావవ్వా గంగవ్వా!! తాళ్ళపాక గ్రామానికి, తరతరాలుగా తలమానికమై, తనికరాన వరాలిచ్చి కాపాడే గంగవ్వా!! బియ్యదులు వల్లించి బింకాలు ఎంచి, కమ్మలొక్కటిగాగ కైమోడ్పులిచ్చి,— విన్నపాల్జేసేను వినవమ్మా తల్లీ- కరదలబువ్వ మమ్మేలుగంగవ్వా-

అవ్వా! కెంపుల గంగవ్వా!
పచ్చని పసిడవ్వా!
యీ వింత వినేవా-
కొండకొమ్మన గోగుపూవు!
కొలనులో తామరపూవు!
గట్టున నేను!-
ఒకరి కొకరి కెంత దూరం?-

గంగవ్వా!- ప్రొద్దు విచ్చింది: ఎండ పొడ వచ్చింది: కొండ కొమ్మ- నీ కొప్పలే- నిగనిగలాడింది!-
మరో పొరవిచ్చింది: కొండకొమ్మన గోగు పూవు- నీ కొప్పులో మందారమల్లే.- చేరువగా, జేగురుగా కనిపించింది: అలా అనిపించిందమ్మా!....

కొండకొమ్మన ఉన్న సూర్యుడు- వెలుగుబాణం విడిచినట్లు, వాడిగా వచ్చింది కాంతి- వచ్చి వచ్చి,- కొలనుపై వాలింది: నీటితో గిలిగింత లాడింది: కొలనులో తామర జిలుగుదేరింది:

అవ్వా! ఆ తామరపూవు - నీమోమేనేమొ! ఆ జిలుగు నీ చిరునవ్వే నేమొ!

ఔనా, కాద!

ఆ వెలుగువంక అట్టే చూసినాను! మాధవస్వామివారు-చేత ధరించిన మాణిక్య ఖడ్గంవలె - అది, - ఏక మెరుపు - నేనూ మెరసినా నవ్వా - మాధవుడో మరెవ్వరో, - నన్ను ఝళిపించినా రవ్వ!- నిజం!.

తేరుకుని, - మరల పైకి చూసినాను! కొండకొమ్మన ఆ నిగనిగలేదు. కొలనులో,- అజిగి జిగిలేదు!

నన్ను ఒక్కక్షణం ఆవహించిన ఆ పారవశ్యం లేదు: కనుచూపు మేరా - వెలుగు! అంత వెలుగులో కాటుకరేకల్లే- నేను - ఎందుకక్కడకు వచ్చినానో గురుతు లేదు? ఎటో గురిలేదు. మరలిపోయినాను!

ఎక్కడికి? - మాధవస్వామి అలయానికి!

ముఖమంటపంలో - ఎవరున్నారు? - మా మేనమామ మాధవయ్య! -

'ఏమిరా, - అన్నమయ్యా, పక్కా ఝూమాయె.

ఏనీమ లేలబోయినావురా? -

స్వామిపూజకు కమలములేవిరా -' అనినాడు.

అంతట గురుతుకు వచ్చిన దవ్వా! -

ఆనాడు - నేటికి పదిపొద్దులనాడు - వైశాఖ పూర్ణిమ: పదారేండ్లకు మునుపు, మనము కనుదెరచిన దానాడు: అక్కడే,- ఆ యింటనే;

వారి ముచ్చట ఏమో,- యింటిల్లిపాదీ,- ఎవరికి వారు చేయి చేసుకుని నన్నెంతగా శృంగారించినారని!-

తలగడుగు దీర్చి, - సరిగ ధోవతి కట్టబెట్టి, బురుసాపని రుమాల వలెవాటుకిచ్చి,- నుదుట,కుంకుమ దిద్దినారు. మా మామగారాబు కూతురులున్నారే, - తిమ్మక్క,- అక్కమ్మా, వాళ్ళు రాలుగాయలవ్వా! - చిన్నది మేనగంధము బూసినది: దానికన్న ముందు పుట్టినది మెడను చంపకదామ ముంచినది. చిన్నది మునివేళ్ళతో నా మోమున పన్నీరు చిలుకరించినది! దానికన్న గుప్పెడున్నది - పకపకలాడినది: ఆ కుందనంపు బొమ్మలగన్న ఐదువరాలు,- యీ చిన్నెలూ చిద్విలాసములూ చూసి, -

మెప్పుగానో మేలముగానో. - అహో! అన్నది - ఆ( - జాతకుడు! - అన్నాడు మా మామ: పదారేళ్ళవాడినైనా, - చాలా కుమారి వలె బిడియపడినా నవ్వా:-

మా మ వెం ట ను ఆలయమునకు పోయినాను: తీరా, అ క్క డ కు చేరు కొన్నాక, 'స్వామి పదములసన్నిధినుంచేవు కాని, - కమలములు తీసుకొని రారా -' అని, - మామ నన్ను వెనుకకు పంపె గందా! - మరచిపోతినే - !

నా మౌనము గమనించి.-మామ రవంత, తనలో తాను, హుంకరించినాడు - నేను,- జంకులేక, - తల ఊపి, - తీసుకునిరాలేదని, - చేతులు తిప్పి, తెలియజెప్పినాను: ఆ య న క న్నా రా నవ్వి, - అపు నయ్యా,- త మ రు తాళ్ళపాక వారు కాదూ.- వేత్తలాయెను; పూజకు పూవుల కోసమని వెంపరలాడే మముబోలిన మంద బుద్ధులా?

అర్చనకు - హృదయారవిందము!-
స్వామిపూజకు,- కనుదమ్ములు,
శ్రీవారి సపర్యకు కరసరోజములు!-

-చాలవా, అని అ భి న యో ప దే శ ము చేసినారు!

మేలాయె!-

మాధవా:- యీ బాలునికి ఏ దీవెన లిచ్చేవోయీ!

అంటూ కనులరమోడ్చినాడు! నేను, ఉన్నతావునే ఉంటిని: అంతలో, పన్నీటి కలశంతో,- పరిమళదామంతో,- ఆలయానికి వచ్చినారు, మా చిన్ని మరదళ్ళు-

పట్టపగలే,- వేయి దీపములు ప్రజ్వలించినట్టయినది రెండు మెరుపులు కలయ మెరసి నటులనిపించినది- ఆ సుషమలో,- కొండకొమ్మన గోగుపూవు,- కొలనులో తామరపూవూ,- కానరాని అనంతమూర్తి కనులవలె మెరసినవి:

అవ్వా! అకను లెవరివి? ఆ కటాక్ష మెవ్వరిది?-

అంతలో మెలకువ కలిగినది!-

మామామ కూతురు, పన్నీటికలశము,- నా కందించినది.

మరదలు,- పరిమళదామము,- ఆమె కందించి,-నావంక లేతచూపు విసిరినది! తి మ్మ క్క ఉ న్న దే — లేడికనుల వలె బెళికి,- బే డి స వ లె మి డి సి,- తీవెనున్న జాజులు రాలినట్లు, కు లి కి,- కన్నులు నివాళిపట్టినట్లు,- నా మో ము కలయజూచి,- వీవనగొని వీచినట్లు,-ముని వేళ్ళ కదలించి,- మోముటుదిప్పి,- అ దా మము నా మెడనుంచబోయి,- తడబడి,- జారవిడిచి,- ఉలికిపడి,- ఒక్కతెప్పపాటు ఆవేశాన నన్నలముకొని,- కొమ్మనున్న కోయిల, చెంగున దూసుకోగా,- చిగురున ఉన్న చివురాకు, ఝల్లుమన్నట్లు,- వెనుకకు కుప్పించి,- తలవంచుకున్నది. నాకు బోధ పడ లేదవ్వా! మా మామవంక జూసినాను; ఆయన చూపు నామీద లేదు: స్వామిమీద లేదు; తాను కన్నవారిమీద!

ఆయన మోము అరుణాబ్జమైనది: ఆ కెందమ్మిలో, తొలిచూపు మ ం దా ర,- మలిచూపు మల్లె!- ఆకవళికలో వల్లమాలిన తామసము! కాని,- ఎత్తిన వేలు తామరసము!

చిన్నతల్లీ!- స్వామివారికని తెచ్చినవి, బావగారికిసమర్పించినావేమ్మా?-అపరాధము కాదా?- అనినాడు మా మామ:





కాదయ్యా!- మాధవస్వామివారు, ముఖ మంటపములోనికి వేం చేసినారనిపించినవి: వారే అనుకొన్నాను; అర్పించినాను - అని,- పలికినవి,- తిమ్మక్క! మా మేన మామ నవ్వుతూ, -

ఓరి అన్నమయ్య!- మాడుపూరివారి ఆడపడచు కంటికి నీవు మాధవునివలె తోచి నావటరా.- నిను కన్నవారు తరించినారు పో(- అని,- నాభుజము తట్టినాడు:

ఆ మాటలకు,;నాకు ఆనందము కలుగ లేదవ్వా!- మా మరదలివంక జూచినాను - కనిపించిన దాలేత మోముకాదు - కొండ కొమ్మన గోగుపువ్వు -! ఎత్తిన తలవంచు కున్నాను - నాయనా!- స్వామిని సేవించు

ఉందాము రా - అని మా మామ,- నన్ను సన్నిధికి తోడుకొని పోయినాడు :

ఎన్నిసారులు ఆలయమునకు రాలేదు !-

అంజలి ఘటించి అడుగుముందుకు వేసే వాడిని : ముఖ మంటపములోనుండి.. సరి మొక్కు లిచ్చేవాడిని : సమీపించుతూ, వేలెత్తి-'పరాకులు పలికేవాడిని : అడుగు ముందుకు పడినకొలదీ,- హెచ్చరిక లుగ్గ డించి.. మననముగా, ఒక్కపల, ఒక్క జంపె, ఒక్క ధవళము, తలపోసి.- శ్రీవారి వైభవచూర్ణిక పఠించి ప్రణమిల్లే వాడినే!- అలా ప్రమాన్పడినా నేమి ?- ఎదుట నున్న స్వామివారు.- కానరారేమి?- వారు ధరించిన నందకధార నా మెరుపేమి?- చేయెత్తినా, ప్రమొక్కలేనేమి?- నాచేతులు,- ఏదో వెదకుచున్నవి ; నామనసు దేనినో ఎవరినో వెంటాడుచున్నది- అది,- వెలుగా, చిమ్మచీకటా?-;వెలుగుకాదు,- చీకటికాదు- వెలిగేనీడ.- మెరసే మే ఘ ము: కంటికి తోచే వాయు తరంగము: ఘన మూల్యంగా, నన్ను కమ్ముకునే పరిమళలహరి—.......

ఎన్ని యుగాలకో నన్ను నేను వెదకి కను గొన్నాను— ఉన్నచోటే మేలుకున్నాను,-

మామామ, నాస్థితిగమనించ లేదు ; వారి తీరున ధ్యానములో వారున్నారు ! చిన్న పిల్లలు!- ఎటు పోయిరో,- ఆ చాయలలేవు:

మరొక్క క్షణానికి,- మా మామ కనులు తెరచి,- వీడ్కోలుగా,- రెప్ప లప్పళించి ప్రమొక్కి-- వెనకకు మూడడుగులు వేసి,- కుదురుచూసుకుని కూర్చున్నాడు : ఎదు రుగా,- నేను : ఆయన అన్నాడు కదా-

'నాయనా !- మంచి రోజు : శుభ ముహూర్తము : కొంతసేపు,- యిష్టాగోష్ఠి చేదాము :

ముగురన్నల'!-వెనుక బుట్టావు!! నీ పుట్టుకతో,- మీ తండ్రి,- మంత్రించినట్టు,- దేశాటనం మాని యింటిపట్టునే ఉంటు న్నాడు : పెద్దపిల్లలను.- ఎన్నడూ,- పలు కరించిన పాపాన పోనివాడు : ఏడాదికో రెండేళ్ళకో ఒకసారి యింటిమొగము చూసే వాడు.- నీ పుట్టుకలకు తిరిగివావడమేమిటి- అంతే- ఎలా మారిపోయినాడో.- ఎప్పుడూ నీ స్మరణే,- తల్లినన్నా చంక నేసుకో నిచ్చెనా ?- నీకు 'నీవుగా నేర్చిన విద్య - ఉంగా,- అనడంవరకే- అమ్మా - తాత - మొదలుకొని,- అథాతో బ్రహ్మజిజ్ఞాసాదే ఖీలూ,- నీకురావడం,- మీ నాయన కటా క్షంవలననే. ఓరీ,- మీతండ్రి నారాయణ సూరి,- సామాన్యుడు కాడురా - మీది,- విద్యావంశమురా,- మీ పెద్దలందరూ మాంచి తపస్సంపన్నులురా !- మీ తండ్రి,- బ్రహ్మోపదేశము పొందిన కొలది సంవ త్సరములకే,- యిల్లు విడిచి పోయి, శాస్త్రానికొక దేశముగా, తిరిగి,- విద్య నిచ్చినవారి మెప్పులనందుకుని, మార్గశి మున,- యిక్కడికి వచ్చి,- మనస్వామి వారి కొలనున్నదే.... అక్కడ కూర్చుని ఉండగా,- మీ అమ్మ- కమలములకని పోయి,-ఆయననుచూసి,- ఎందుకో మొక్క బుద్దై నమస్కారము చేసిందట: వారుచూసి ఊరుకున్నారట. మాలక్షమ్మ- యింటికి తిరిగి వస్తూ,- త్రోవలో, మా తండ్రి కని పించేసరికి,- చెంగున సమీపించి,- నాయనా కొలను ఒడ్డున పొద్దుపొడిచినటుంది. ఎవరో అక్కడ కూర్చునిఉన్నారు ; నమస్కారం చేసి వచ్చాను : నీవు చూసిరా !- అని, యింటికి పరుగుతీసింది! మానాయన గారు,







ఆ ప్రాంతానికి కుతూహలం కొద్దీ వెళ్ళ డమూ,- చూసీచూడటంతోనే ముచ్చట పడటమూ. కుశల ప్రశ్నలడగటమూ ఆర్షేయ పౌరుషేయములు విచా రించడమూ,- మా కులగోత్రములూ, గణ్యతా, మాటలో మాటగా చెప్పడమూ,, యెక్కడెక్కడివో బంధుత్వములు తిరగ వేయడమూ, ప్రొద్దువంక జూచి, నాయనా,- దేవతార్చన మన లోగిలిలో చేసు కుందువుగాని, రమ్మని వీరుప్రత్యుత్థానము,- చేయడమూ, మాదాప రాననడమూ,- అర ఘడియలో అంత గ్రంథము నడచిన దనుకో....

ఆయన రాననడం,- మా నాయనకు ఓగాయిత్యంగా తోచింది : మీ తండ్రికి.. పిలిచిన చోటికి భోజనమునకు పోక పోవడం,- తానై అడిగి ఆరగించడం,- అదో వ్రతమని,- యీ గృహస్థుకు తెలి యదు : ఇందుకుతోడు యింకొక చిక్కు వచ్చింది: ఆహ్వానించిన అతిథి, రాక

పోతూనా.. యిహ ఆ ప్రొద్దు అభోజనమే: అది ఆయన వ్రతం: నిజానికి, ఒక్కపూట ఉపవసించడం, ఏమంత లెక్కలోనిదా.. కాని.. ఎవరో పరదేశి.. తనంతవాడు వెదుక్కుంటూ వెళ్ళి పిలిస్తే, రానని అనడమేమిటా అని.. మనసులో గింజుకున్నాడనుకో.. అయినా పరుషవాక్కు రాలేదు: చూడగా చూడగా.. ఆయనను అక్కడే వదలిపోదలచలేదు: మా నాయన మట్టుకు ఘటికుడుకాడా.. అన్నాడు కదా!..

దానికేం నాయనా - పోనిలే!.. భోజనమున కని రావద్దు కాని.. మా పిల్లదానినిచ్చి, నిన్నో యింటివాడిని చేసేను - నీ యింటనే భుజింతువుకాని.. అదో - ఆలయము.. ఒక్క గడియలో.. మా మాధవ స్వామి సన్నిధిలో కల్యాణము: యిదే సుముహూర్తము: మా యిలవేలుపే పెండ్లి పెద్ద - తరలి రావయ్య -

అని.. సమాధానము కోసము నిరీక్షించక తనదారిని తాను యింటికివచ్చి.. వలసిన సన్నాహములన్ని సమకూర్చినాడు; మన గ్రామములో నలుగురు పెద్దలకూ.. యీ విషయం శ్రుతపరచి.. పెళ్ళి కుమారుని తరలించుకుని రావడమునకని.. నాకు వారిని తోడిచ్చి పంపినాడు: మీ నాయన, విద్యావినయ భూషితుడు అయిన లాభాన.. తల వంచుకుని వచ్చి.. తగుదునని పించుకున్నాడు: అది మా బాగే.—

తనవానికి తగిన అల్లుడుదొరికినాడని మా నాయన సంతోషించినాడు: మీ తలిదండ్రుల వివాహము ఊరికి ఉత్సవమాయెననుకో!.. ఆ సద్దు మణిగినతరువాత మా నాయన, అల్లుడి చేతులు పట్టుకుని..

నాయనా.. యీ శుభకార్యమంతా.. రవంత ఉద్వేగముతో నడచినది. పెద్దవాడను.. నాకా ఆలోచనతోచే స్థితిలో లేననుకో.. నీకాపాటి చనువూ స్వాతంత్ర్యమూలేదా?.. నీవైనసూ చెప్పి ఉండవలసినది: నీ తలిదండ్రులను ఆహ్వానించవలెనన్న యింగితమే లేకపోయె సుమీ: యిది, మహాపరాధము తండ్రీ:.. నన్ను నరులు మెచ్చరు.. నారాయణుడు మెచ్చడు.!

ఒంటరిగపోయి, తగుదునని తల యెత్తుకుని.. యిలా జరిగింది.. యిది, నా నిర్వాహకమే.. అని వారి సమక్షంలో.. విన్నవించుకుందామంటే నాకు అపాటి నిబ్బరం లేదు. తెచ్చుకోలేను: ఊరితో ఉన్న నలుగురూ చేరి తలవాచేటట్లు పెడతారేమోనని జంకుతున్నాననుకునేవు!.. నా దగ్గ ఆది కాదు: మీ తలితండ్రులు.. సద్ధర్ములు కనుక.. నేను ఏ కరువు బెట్టిందంతా విని మెదలకుండా ఉన్నారనుకో.. ఏ లోపమూ జరగనట్టుగానే భావించి, నాకు వియ్యంకుడి మరియాదలు చేశారనుకో....అప్పుడు మరీ ఉత్కృష్టాన పడతాను: మళ్ళీ యీజన్మకు వారి ఎదుటపడటానికి నాకు మొగంచెల్లదు: అవునయ్యా.. మేము గంగిగోవులంగాదు. గండు పులులం కాదు. మధ్యరకం: మనసు నొచ్చిందా.. నోటికి వచ్చినట్లు అంటాం: అవతలవారంటే పడతాం: అది అంతలో చెల్లు, అదీ మాపరిపాటి: నీవుచెప్పినదాన్ని బట్టి అయితేనేం.. నా ఎరికనైతేనేం - మీ నాయనగారంటే.. శాంతానికీ శమదమాదులకూ ఆయన పెట్టింది పేరు: యింత జరిగినా - తొణకరు: అందుకనే నే నిలా ఉడుకుడుచుకుంటూన్నది:



# కార్ట్యూనులు

సరదా అయిన కార్టూన్‌లు
సన్నాయి నొక్కుల ట్యూన్‌లు
నాలుగో ఐదో లైన్‌లు
కలబోస్తే కార్ట్యూన్‌లు!

జ్యోతిలో వచ్చే జనవరి
సంచికనుంచి ఓ చదువరి!
ఈ కొత్త శీర్షికను వెలువరి
స్తామని మా హామీ మరిమరి

కనుక.. నీవు కూడా బయలుదేరి.. నీవంటే మీ ఉభయులూ అన్న మాటే. అక్కడ వారిని ప్రసన్నులను జేస్తివట్టాయెనా.. అప్పుడు నేను సాష్టాంగపడినా.. అది కొంత రాణింపు! మరిన్నీ, వారు బ్రహ్మణ్యులు కావడంతో.. కోడలిమొగం చూసీ చూడటంతో.. యింత లక్షణంగా ఉన్న పిల్లను కన్నతండ్రి అప్రాచ్యుడై ఉండడు, అనుకుని.. నన్ను ఆదరించక మానరని, నా ఆశ: యింతకూ, నీ అభిప్రాయమేమయ్యా.

అలా, మా నాయన గగ్గోలుపడగా.. మా నాన, వారివంక తీరుబడిగా చూసి.. చూసి చూసి ఒక నవ్వునవ్వి. మామగారూ, మీ అమాయకత్వం ముందు.. తెచ్చిపెట్టుకున్న గడుసుతనం రాణింపుకు రాలేదు: శాస్త్రంతోయుద్ధారు కాని.. అవతకలేదు: మీరు మతిమరపువారు కాదు, మైమరపువారు కారు; నా ఆనుపానూ సకలమూ తెలుసుకునే పిల్లనిచ్చారు కాని.. ఎదురొచ్చిన పరదేశిమెళ్లో ఏనుగు పూలమాలవేస్తే ఊరివారు ఎత్తిపట్టిన కథ వతు కాలేదు. యీతంతు: వేసేభారం స్వామిమీదవేసి.. వారి పేరున నన్ను గద్దించి.. నోరెత్తకుండాచేసి ఓ యింటివాణ్ణి చేశారు మీరు. నాకూ రావలసిన బలగం ఉంది.. అనుకునే ప్రమేయం ఏముంది?.. పెళ్ళిపెద్దలు. స్వామివారు! లోపాలోపములు వారికే వదలివేయడం ఉత్తమం కాదా? మరొక విషయం కూడా ప్రస్తావిస్తాను: మా నాయన ఎంత శాంతమూర్తీ బ్రహ్మణ్యుడూ, అయినప్పటికీ. వంగనం ఎక్కడికి పోతుంది: ఆయనా సాటి నందవరీకుడే కాని.. వెలనాటి భాందనుడా?.. ప్రోవసుపోయే వాణ్ణి.. పట్టుకుని వాడికేం

బొగుండబట్టి కుమార్తెను కట్టబెట్టారుకాని, మీరేమన్నా అకృత్యంచేశారా? యిక.. ఆహ్వానించడం వగయిరా లాంఛనముల ప్రమేయమంటారా? అది.- వీలూ సాలూ బట్టి ఉంటుందికాని.. దానికో శాస్త్రముందా?- వెనుకటికి, మా నాయనమ్మ వైవాహికం కొంచెము కుడి ఎడమగా.. యిదే ధోరణిలో నడచినదని వినికిడి: అవి వైశాఖ మాసం ప్రొద్దులు: మా ముత్తాత అప్పటికి పదిమాసముల క్రితం కాశీయాత్రకు వెళ్ళినాడట.- యింటికైన యిల్లాలు ముగ్గు నిడుతుండగా ఆమె సోదరుడు.. మీ అంతటి అమాయకుడే- ధోవతి కుచ్చెళ్ళు కాళ్ళబందాలు పడుతుండగా.. రుసరుసవచ్చి.. చెల్లెలితో, అమ్మాయ్- ఏదీ మీసిక్షేపరాయుడు! ఒక్కకేక వేసి.. ఆవిడమాట వినిపించుకోకుండా ఎక్కడ దాక్కున్నావురా భడవాకానా.. రా.. నీపెళ్ళి చేస్తాను- అనిగర్జిస్తూ.. ఇల్లు కలయదిరిగి.. మళ్లీ గుమ్మంలోకి వచ్చేసరికి.. అసిక్షేపరాయుడు.. ఎక్కడనుంచో ఒంటిచేతిమీద బిళ్ళంగోడు ఆడుకుంటూ, కూతపెట్టుకుంటూ యింటి చాయలకు రావడమూ, పిల్లవాడికన్న ముందుగా.. గోడు బిళ్ళ ఒక త్రుళ్ళునపోయి.. మేనమామ వెన్నుపట్టెను పరామర్శించడమూ జరిగింది పిల్లవాడు.. యిది గమనించి, అటు చెంగుమన బోయినాడు.. కాని, యీయన.. ఆగు భడవా.. అక్కడ ఆగు!. అని.. ఏకరంకెలో.. మీదికి.. వుప్పించి.. రెక్కఒడిసి పట్టుకుని, యింతకు ముందు మా భామిని కొట్టావ్.. యిప్పుడు నన్నేకొట్టావ్.. మరీ పోతరంగా ఉందే.. ఒళ్ళు వాచి కొట్టుకుంటున్నావ్.. రా.. నీ పెళ్ళి చేస్తాను. అంటూ కోపం అభినయించి.. అమ్మడూ.. వీణ్ణి.. ఇల్లరికం, తీసుకుపోతున్నానమ్మోవ్ అనేసి.. ఆపళాన వెంటబెట్టుకు పోయి.. యిటు యిదుక్కి పొదుక్కి అయినా తెలియకుండా.. అన్నంతపనీ చేశాడు! పిల్లవాడు అన్నం వేళకు యింటికి రాకపోవడంతో.. తల్లి వెదుకుకుంటూ వెళ్ళి చూస్తే- పసుపు బట్టలూ వీరూను: ఆవిడ అట్టె విస్తుపోయి.. అన్నయ్యా, ఏమిటిది!- అనగా..

అమ్మాయ్ - వాడూ యిదీ.. కుప్పిలూ పువ్వులూ ఆడారు: వీడు ఓడాడు: ఉక్రోషంకొద్దీ, కాయలు చిమ్మేసి భామిని రెండంటించి..పరుగెత్తాడు: లేత ఒళ్ళేమో.. చెంపమీద వేళ్ళు తేలినాయె- చూసి.. హాం- అన్నాను: ఏం లేదులే నాన్నా!- అంది. ఎంత దెబ్బకొట్టాడే - అన్నాను. నాకు తగల్లేదుగా - అని.. నవ్వింది. ఎలా నవ్విందని - ముప్పైఏళ్ళు కాపురంచేసిన అరిందాకుమల్లే-అంత సహనంతోనవ్విందే! శ్రీహరీ!- యీ ఆడపుట్టుకకు పాతివ్రత్యం అనేవి.. కర్ణుడి కవచంలాగా, పుట్టుకతో వచ్చేది: ఒకరు నేర్పేదికాదు: చూసి నేర్చుకునేదీకాదు! నిజమే,.. కాని నాసంగతి నీకు తెలుసునుకాదూ - నాకడుపున పుట్టిన బిడ్డ - మరోయింట పుట్టినవాడు.. చెయిచేసుకుంటే పడటమూ అని.. భగ్గుమన్నదనుకో - ఎలాగూ రాసిపెట్టిందే కనుక.. రేపు మళ్ళీ వీళ్ళు కీచులాడుకునేలోగా.. ఆమాడుముళ్ళు వేయిస్తే - సహధర్మచారిణి అయేను గనుక.. యిది, తిరగబడి ఒకటివేసినా.. వేయమని మావంటివాళ్ళు చెప్పినా..శాస్త్ర సమ్మతం అవుతుంది- దీనికిదే మందు అనుకున్నాను! నా ఊహని చెవిని వేశాననుకో,.. కోడలు రావడం





ముచ్చటే అయినా.. మీ ఆయన తిరిగి రాందీ - నీవు ఒప్పుకోవు - అంతవరకూ, నేనాగడలచుకోలేదు: శుభం అన్నాను! అయిందనిపించాను!

ఇలా అన్నాడు!

ఆవిడ ఏమంటుంది? - మనసులో ఏమున్నా, పైకిమటుకు నవ్వేసింది: మరో ఏణ్ణర్థానికి కాశీ వెళ్ళినాయనా తిరిగి వచ్చాడు: అంతా విని.. ఆయనా నవ్వేశాడు! అది.. యిప్పటిలాగునే సత్యకాలం. చిత్తగించారూ.. చూడగా.. అంతటి ఘనులే మీరాను! అనుకున్నది.. తలచినంతలో చలామణీ చేయడం - చేయగలగడం కొన్ని జాతకాలకే చెల్లును - యింతకూ నే మనవి చేసేది: యిలాటి వ్రుటవృత్తియాలు.. మా కుటుంబంవారికి క్రొత్తకావు! మా నాయనగారికి యిక్కడ నడచిన సమాచారం తెలిసినమీదట విస్తుపోయేరనుకునేరు. నవ్వి ఊరుకుంటారు- మీకు.. వారి విషయంలో-- నిశ్చింత-

ఇక.. స్వవిషయానికి వస్తాను:

నేను, యిటు రావలెనని రాలేదు: యిక్కడ ఫలానా గ్రామం ఉన్నదని కూడా వినలేదు: నా ధోరణిలో నేనుండి నడుచుకుంటూ వస్తున్నాను. కొలను సమీపమునకు వచ్చేసరికి - ఏదో బరువు దించినట్లు.. చేరవలసిన తావునకు చేరినట్లనిపించింది: కూర్చున్నాను: సూర్యరశ్మి నామీద సోకగానే.. ఎవరో ఆప్తబంధువు సాదరంగా వెన్నునిమిరినట్లు తోచింది: నిశ్శబ్దము మంగళవాద్య ఘోషగా.. వినిపించింది: మా గంగవ్వ కనిపించింది: ఆనందంతో కనులరమోడ్చినాను. కనులు తెరువగానే- చేయెత్తి మ్రొక్కుతూ, మీ చిన్నది. ఆ సంభ్రమములో సర్వమూ మరచినాను- మనసు పదారేళ్ళ వెనుకకొక్క పరుగు తీసింది: మా గంగవ్వ.. కనులముందు, లీలగా తోచింది: మా కామక్క పలికిన పకినెం మరల మువ్వలు మ్రోగినట్లు మ్రోగింది: ఆ సంభ్రమంలో సర్వమూ మరచిపోయినాను: సంభ్రమానికి కారణం.. వెనుక మనవి చేస్తాను: సర్వమూ మరచినానంటినే- ఆకథ యిది-

నిపుడు.. శరన్నవరాత్రములలో.. ఒక సంస్థానంలో.. నలుగురిలో.. ఒక విద్వాంసుడు, నాకన్న అన్నివిధాలా పెద్దవాడు, నిశితయోగ్యుడు- ఖిన్నుడు కావడం సంభవించింది: కారణం- నేను. నేనన గా- నా అహంకారం: ఏ కించిత్ సుకృతంవల్లనో, వచ్చిన చదువు వంటబట్టి- వాదోటు కావడంతో నాకు తెలియకుండానే అవహించిన అవినయం-

సభారంజనముకని ప్రారంభించిన,చర్చ సిగపట్టుదాకా తెచ్చింది నేనే - వారిని నిరుత్తరుణ్ణి చేసింది నేనే -

నేనే - అనగా యీ మూఢుడే!-

వారు, ఒక్కక్షణం నావంకచూసి.. శిరసున ఉన్న సేలువతీసి.. నా శిరసున ఉంచి.. తలవంచుకుని.. సభవారివద్ద సెలవు తీసుకున్నారు- సభవారు.. ఏలినవారితోబాటు.. కౌరవ సభలో, పాండవుల వలె!-

ఆ పండితుడు.. అందరి మౌనమూ తనకు బరాబరులు చేయగా.. నిర్గమించినాడు! నేను విజయగర్వంతో.. శూన్య పీఠమువైపు చూసినాను! అంతమేరా.. మసకవేసినట్లయినది! ఆ మసక - మసకా

కరువున బోసినట్లయి - తటాలున మెరసి నట్లయి - మా గంగవ్వ మోము కనిపించినది. ఆ అవ్వ నన్ను వెన్నున ఒక్కటి చరచి నట్లనిపించినది - అట్టే ఉలికిపడినాను: ఆ ఉలికిపాటున కన్నులు తెరిపిన పడినవి:

నా కిక. ఆరాజూ కనిపించలేదు - ఆసభ వారూ కనిపించలేదు- ఒక్క పరుగున వారిని తరుముకుపోయినాను! వారిని చేరుకున్నాను: సాగిల పడినాను; వారి పదములు పట్టుకుని - పూజ్యుడా! నన్నను గ్రహించి,- విద్యాదానము చేసిన మహనీయులు,- ఎందువల్లనో నాకు బుద్ధులు చెప్పలేదు: మా గంగవ్వ,- చెంపపెట్టుగా,- నాకు వివేకమిచ్చినది - కన్ను తెరచినది - వలసిన గురువును నిర్దేశించినది- నేను అనుదినమూ,- మనసా పూజించే గురువులలో, తాము ప్రథమగణనీయులు: తమమౌనము,- నాకు వినయ ముపదేశించినది: నన్ను గర్వినిగా రూపొందించిన మునుపటి చదువరి తనమును,- మీ పాదసన్నిధిని ధారపోసినాను; యిదే నా సమర్పించు గురుదక్షిణ, స్వీకరించండి - నేనూ, నావంశము వారూ,- వినయశీలురై వాసించేరని దీవించండి!' అని వేడుకున్నాను; వారు ప్రసన్నులై,- నన్ను చేరదీసి,- నాయనా,- నీవు అమాయకుడవు! విశేషించి, అంబ అనుగ్రహము కలవాడవు; నీవు కోరిన తీరున మీ యిలువాసి నిలిపేవారు వర్ధిల్లేరులే!

నా దీవెనతో నీకు నిమిత్తములేదయ్యా! నీవే నాకు దీవెనవైనావు. ఔనయ్యా!-

వాది,- తలకుమించిన చదువుకాదు; ఏదో తగుపాటిది. గురువులు ప్రసాదించిన దానికో అబ్బినది అరపాలుకూడాఉండదేమో-అందుకే నాకెంత అహంకారమని! అంగవస్త్రమంత లేదీ సంస్థానము; గోష్పాదమంత లేదీ సభ- దానికి వారు ప్రభువులు; దీనికి నేను,- ధర్మాధికారిని. ఎన్నడన్నా, నీలాగే,- దారితప్పి,- ఓ పండితుడు, దయచేసినట్లాయెనా,- అది మా పుణ్యమనుకోవడం పోయి,- స్థానబలిమి చూసుకుని, మే మే ఘనులమనుకొని,- యెద్దెమంటే తెద్దెమని,- వారిచేత పలికించి మేము యావన్మందిమీ వినోదించి,- ఓ తృణం ముట్టజెప్పడం- సాగనంపడం. పరిపాటి అయిపోయినది; యింతకు పూర్వము వచ్చిన వారు, కష్టసుఖములు పారజూచిన వారూ,- సభామర్యాద పాటించే వారూ, మరిన్నీ వినయభూషితులూ కావడంతో,- మమ్మల్ని గద్దించలేదు: మృదువుగా బుద్ధి చెప్పలేదు:

విద్యనేర్పడం- ఎదుటివాడిని జయించడానికా,- అంతశ్శత్రువులను జయించడానికా,-

నాయనా,- సనాశివుని,- శిరసెక్కి- కూర్చున్నా- శీతాంశుడు,- గర్వించి చండకిరణుడు కాలేడే!-

అదీ వినయము:

మా సభను నీవు రావడం,- నేనలా కావడం - మంచికే!- ఏవో రామాకృష్ణా అనుకుంటూ;- యిప్పటికన్నా చదువుల సారం గ్రహించి తరించే యోగ్యత నాకు ప్రసాదించమని ఆ వరంధాముణ్ణి కొలుచుకుంటాను.

దీవెన కోరినావు: నిన్ను దీవించే అర్హత నాకు నీవలెనే ప్రాప్తించింది:

నీవంశమువారికి యిదే దీవెన- చదువరులైననూ, సంస్కారులై సన్మార్గగాములై



సద్వృత్తి కాములై- మీ తాళ్ళపాక వారు విలసిల్లేరు గాక:—,.

యిలా సెలవిచ్చి, నన్ను పుత్రవాత్సల్యంతో ఆదరించి,- వారు అనుమతించగా అక్కడనుండి కదలినాను; వంచిన తల ఎత్తకుండా,- ఎటుపోవుచున్నదీ కూడా, తెలియకుండా,, ఎన్ని ప్రొద్దులునడచానో?-

వారు సజ్జనులు: కనుక,-

నన్ను మన్నించినారు:

కాని, నా ఆరాటము తగ్గలేదు.

అంతలో.. వారి..దీవెన జ్ఞప్తికి రావడం. కొంత చిత్తశాంతి లభించడం.. మళ్ళా ఏక ఉరవడిని జరిగినది గురుతుకు రావడము - మతిపోయినట్టు కావడం - యిదీ నా స్థితి-

నా సుకృతమే.. యిక్కడికి చేర్చింది- మా అవ్వ-దీవెన నన్ను - గృహస్తును చేసింది ! యిది, తేటతెల్లమేకద !-

అయ్యేది..'ఒక్క ఘట్టము - తమరు, తండ్రివంటివారైనారు కనుక మనవిచేయడం విధాయకం - మళ్లీ.. మొదలుకువస్తాను-

నేను, పుట్టి బుద్ధెరిగిన తాళ్ళపాకకు వెన్నుచూపినది, నేటికిసరిగ పదారేళ్ళనాడు !

నాకు, చిన్నప్పటినుంచీ కాలు నిలిచేది కాదు !

మా పెద్దలందరూ.. నా ఎరికలో,.. యిల్లో,. నారాయణులు !

నాకు ఎవరిపోలిక వచ్చిందో తెలియదు! ఉపనయనానంతరం, వారికి, తోచినంత వరకూ,. నాకు ప్రాప్తమున్నంతవరకూ - మా నాయనగారే చెప్పారు - అంతవరకూ లేని తపన అప్పుడు ప్రారంభమైనది. నా వైఖరి గమనించినారు : వైనం అడిగినారు. నేను, మాట్లాడలేదు - సరే నన్నారు ! కాదు, కూడదని, మాటవరసకన్నా అనక పోగా, వారేమని సెలవిచ్చి తరలించినారంటే-

నారాయణా, ఉన్నఊరినీ కన్నవారినీ మరచిపో! యిక మీదట నీకు ఆ శ్రీహరి తండ్రి- శ్రీదేవి తల్లి : హరిభక్తులు బంధు కోటి : యీ జగమే స్వగ్రామము :

మన గంగవ్వకు విన్నవించుకుని,- కామక్క-చేత ఔననిపించుకుని. క్షేమా న పోమేవుకాని !—

వారలా అన్నమీదట, దారినే పోయి.. మా పొలిమేర కాచే గంగవ్వకు మ్రొక్కు-లిచ్చుకున్నాను:- యిలా విన్నవించుకున్నాను :—

అవ్వా.. యింట పెరిగిన చదువు వంటబట్టింది- ఆకళింపుకొచ్చి, అర్థాకలిమీదున్నా !- విద్యలు తేటోతున్నా- నేనే సీమమెట్టినా.. ఎదుట నీవుండాలి-

నేనే తప్పుచేసినా.. నావెన్ను కాయాలి!-

నేనీ తీరున మనవులిచ్చుకుంటూ ఉండగా.. అంతలో.. మా కామక్క, మా జడల మర్రి చెల్లెలు.. భూమితోపాటుపట్టి.. అకాశమంత బుద్ధెరిగిన అడకూతురు.. మా గంగవ్వ గొంతు, మా గణాచారి.. గాలిమీద తేలుతూ,.. ఎండమీద ఊగుతూ, వచ్చింది- మనసుకు కన్నులు తెచ్చుకు మావంక జూసింది. గంటమ్రోగినట్లు నవ్వింది, పెదవి బిగించి భ్రమరనాదం జేసింది. రావాకల్లే, మెరమెరలాడింది ! గొంతు గలగల్లాడింది-

'కూకటికి గుప్పెడెదగరా - కుదురులేక తిరగరా - చీకటి మానల్లె వెలుగుమేసి.. చిగురేయరా పదారేళ్ళా !

అన్నేళ్ళ కన్నేళ్ళకు - అయ్యలూ - కాలుమళ్ళి.. కన్నుమళ్ళి, కానున్నదయ్యేనురా - సీమగాని సీమలో.. చిగురంత పొద్దులో కడలిపుట్టిన పండు చిలుకముగ్గేయంగ బాలభానుడ నీకు చెంగల్వ మొక్కంగ మాధవుడె మన్మధుడు అయ్యేనురా - అయ్యలూ - అవ్వ పలికింది - పో !-'

ఆనాడు, కామక్క పలికింది - అక్షరాలా యీనాడు ఫలించింది !

జరిగినదానికి, మనం కర్తలముకాము ! మా గంగవ్వ కరుణ - మాధవస్వామి నిర్వహణ.... !

అని మా నాయనగారిని అనునయించి.. అందరూ సుఖంగా, ఉంటూండగా,. ఓ నాలుగుమాసాలుజరిగినవి: మా.లక్కమ్మకు పెద్దపిల్లవాడు కడుపునపడ్డాడు : మూడో నెల వెళ్ళకముందు,. పుట్టింటివారు చేయవలసిన ముచ్చటలుచేశాడు: ఆనాడే మీ నాయన మళ్ళీ దేశసంచారం ప్రారంభించాడు : అలా వెళ్ళివెళ్ళి.. పిల్లవాడికి ఏడో నెల జొరబడుతూండగా,. మళ్లీ ప్రత్యక్షమైనాడు : పసివాడికి నామకరణ మహోత్సవాదికములు లక్షణంగా జరిగినవి : యీ విడత,. మీనాయన ఏణ్ణర్థంపాటు.. యింటి పట్టునే ఉన్నాడు- మావాళ్ళు,- కుర్రవాడికి కాలు కుదిరిందని సంతోషించినారు : ఊహుం.- మళ్లీ యధాప్రకారం ! సరిగ్గా.. ఏడాదికి తిరిగి వచ్చాడు, తొట్టిలో కేరింతలాడుతున్న కవలపిల్లల్ని చూశాడు: బ్రహ్మానంద భరితుడైనట్టూ కనిపించాడు : యీసారి, ఏకళనున్నాడో.. రెండేళ్ళపాటు పదచలనం చేయలేదు :

నీ పుటకలకు ముందు- అంతకాలమూ కిమ్మనకుండా.. ఉన్నవాడు.. మా నాయన యిక ఉగ్గపట్టలేక.. మాటావతో.. కించిత్, యీ ప్రస్తావనచేశాడు : ప్రయాణం పెట్టుకున్నావా, నాయనా!' యీ ఒక్కవాక్యమే వారన్నది! ఆయన,. కళాఘాతం తగిలినట్లు త్రుళ్ళిపడి.. మంగలాన జాజులు వేగిన మొగంపెట్టి. 'చిత్తము! తిరిగిరాగానే మరి పదచలనం చేయను.' అని వినయం ఉట్టిపడేట్టు చెప్పి.. పయనించినాడు ;

ఈ విషయము, మొన్నమొన్నటివరకూ మాకు తెలియనే తెలియదు సుమీ !

నీకు అయిదోనెల రాగానే.. పూర్ణిమనాడు.. మన యింట ఆచారం ప్రకారము.. అందరమూ మాధవస్వామి ఆలయమునకు పోయినాము ! అలా.. ఎదుట స్వామివారు! శంఖ చక్రాది భూషితులు ! వారికి మొక్కిన కన్నులతో, మీ నలుగురివంక జూచినాను ! అది.. నాభ్రమే అనుకో.. హరి కరుణే అనుకో.. మీ అన్నదమ్ములు.. స్వామివారి, శంఖ చక్ర కౌమోదకీ నందకములవలె.- నా కంటికి తోచినారు ! నిజమిది నాయనా-

పరమానందములో.. మా లక్కమ్మకిది తెలియజెప్పి., 'అమ్మాయి - నీ కడుపు చలువను, స్వామిని నిరాయుధుణ్ణి చేస్తున్నావమ్మా !- మళ్లీ సాలుకు.. ఆ చాపముకూడా మిగలదు !' అన్నాను ; యీ ముక్కలు కేవలం ఆనందం కొలదీ అన్నవి ; అలా అనడమే.. అపచారమైనది ! ఆవేళా - విశేషమేమోగాని....

వినీ వినంగానే.. మా లక్కమ్మ కనులు జ్యోతులవలె మెరసినవి ; 'అన్నా !- ఎంత మాట పుట్టిందన్నా !-' అంటూ వాపోయినది ; 'స్వామిని నిరాయుధుణ్ణి చేసిన పాపాన.. నా త్రోవను నేను పోయేను, శార్ఙపాణిని మీరే సేవించుకుందురుగాని-' అని శపథముగా పలికినది....నీ చెక్కిలి నిమురుతూ.. 'చిన్నవాడా !-

అమ్మవంకవారి దైవానికి.. దూరమౌతున్నావ్! యిక నీ యిలవేలుపును నీవే వెదుక్కోవాలి-' అన్నది! అందుకు నా మనసు ఎంత క్షోభపడిందని.? బతిమాలుకున్నాను. బామాలుకున్నాను! అయినవారి చేత చెప్పించాను ; చివరకు, మా నాయన కూడా.. చేతులుపట్టుకుని.. నట్టింటి శ్రీమహాలక్ష్మివమ్మా- నీవు అలిగి పోరాదే మా

అమ్మా.. ఎల్లకాలము పిల్లలను చల్లగా చూడవే! అంటూ ఎంతో యిదయినారు: ఉహూం.. మీ అమ్మ అన్నదికదా.. నాన్నా!.. నాకు ఎవరిమీద అలుక!.. యిటుకన్నవారు, ఎదుట మాధవస్వామి!.. యింటపుట్టిన ఆడపడుచు ఎంత సలక్షణంగాఉన్నా.. యిల్లు పట్టిన ఆడపడుచు కారాదని పెద్దలంటారు కదా. మా అత్తమామలకు.. మా యోగక్షేమములు తెలుస్తూనే ఉన్నా.. వారిక్కడికి దయచేయులేదు: మేమక్కడికి పోయి పదిపొద్దులైనా ఉండలేదు: మీ ముచ్చటతీరింది: యోగ్యుడైన అల్లుణ్ణి తెచ్చుకున్నారు.. మన మల ముద్దుమురిపాలు చూసి ఆనందిస్తున్నారు: నామటుకు నేను, వారు ఎప్పుడు తిరిగి దయచేస్తారా.. అని ఎదురు చూడటమూ, రాంగనే.. వారిసేవల కొదగడమూ, పసివాళ్ళతో సతమతము కావడమూ.. ఆవేళ కావేళకు మాధవస్వామిని కొలుచుకోవడమూ.

ఇలాగే కాలము వెళ్ళమారుస్తున్నాను గాని.. ఒక్కనాడైనా.. మా అత్తమామలను తలచిన పుణ్యాన పోవడం కాని.. వారిని చూడవలెననే అభిలాష కాని కలగలేదు: యిది.. నిజానికి లోక విద్దూరమే! మీరు, కనుచూపుమేరలో.. చాలినవారూ.. సభాపతులూ.. కావడంతో.. ఎవరూ, కలుగజేసుకొనలేదు కాని.. మరో సామాన్య గృహస్తు యిలాగే, అల్లుడివంకవారి ప్రమేయం లేకుండా, పెళ్ళిచేసి.. నాలుగు పురుళ్ళు పోసుకున్నా.. చుట్టపు చూపుగానన్నా కుమార్తెను ఆ గడప త్రొక్కనియ్యలేదంటే.. మీ మటుకు మీ రూరుకునే వారా చెప్పండి! ఎందుచేతనో.. మీకూ నాకూ తోచలేదు: కావలసినవాళ్ళు చెప్పలేదు! అది ఎవరిలోపమూ అనడానికి వీల్లేదు: కారణార్థం అలా ఉంది; యీక్షణంవరకూ!

అన్నయ్య - నాబిడ్డలమీది అపేక్షకొద్దీ- అలా అన్నాడు!

అందులో.. తప్పులేదు!

కాని.. నాకెందుకో - అలా పలికింది అన్నయ్యకాదు- మన స్వామివారే అనిపించింది. ఒక చెంపన ఆనందం- ఆనందమంత ఆక్రోశం.. నన్నలముకున్నది: అంగరంగ వైభవాలతో నిత్య సేవలందుకుంటూన్న స్వామివారి హస్తములనుండి ఆ వరద ముద్రలను నేను దోచుకున్నానా - వారిని నిరాభరణులను చేసినానా.. స్వామివారు చిన్నబోయినారా - పాలకడలివలె.. వెలుగుపొంగే గర్భాలయం కటిక చీకటి పాల్జేసిన పాపాత్మురాలిని నేనా?- నా జన్మలన్నీ ఒక్కపరి ఆక్రోశించినవి! ఆ చీకటిలో.. మాధవుని కోసం.. మన పెద్దలు చేసిన తపస్సు, వెదకులాడినది! నా మనస్సు మువ్వలు ఘణఘణలాడినట్లయినది: బాలకృష్ణుడు.. మువ్వల చిందులు వేసే గోపాలుడై.. దరియవచ్చినాడు! ఆ స్వామి సమీపించినకొలదీ.. మాధవుడు, మబ్బుచాటున మెరుపై.. రేకతోచకుండ కనుమరుగైనాడు! నా కనులలో మువ్వగోపాలుడు కాపురము కట్టినాడు: వాడే నాచేత పలికించినాడేమో! తెలియదు - అర్థముకాదు. తరతరాలుగా.. మన యిలవేల్పై వెలసిన స్వామి - మాకు దూరం కావడం ఏమిటి. ఈ పసికందు, తన దైవాన్ని తాను వెదుకుకోవడమేమిటి? దైవమే తెల్పవలె!







నాయనా.. నేను మా అత్తమామ ఇంటికి పోయేను! అన్నను సాయమిచ్చి పంపు! బాలను! మరి.. సారెచీరెలు కోరను! నేను చేసిన పూజలే మాకు సిరిసంపదలయేను! నేను నోచిన నోములే నా బిడ్డలకు గుణగణాలిచ్చేను: నా నుదుటి కుంకుమే.. నా యిలవేలుపయ్యేను.....'

అని.. అపూటే.. మీ ఊరికి పయనమైంది:

వెంట నేను వెళ్ళినాను:

దారిపొడుగునా, చిన్ననాటివలెనే ఎన్నో కబురులూ కథలూ చెప్పుకున్నాము: విడిసిన తావున.. అచ్చనగాయ లాడుకుని.. కేరింతలు కొట్టి.. ఎన్నడో మరచిపోయిన పాటలు పాడి.. ఒక్క క్షణమైనా.. మరో ధ్యాస లేకుండా.. ప్రయాణము సాగించినాము: నేను చిన్నబోతానని మాలక్షమ్మ గ్రహించి.. యిలాగారాబాలు పోయి నన్ను మభ్యపెట్టింది. కాని.. నామనసులో కించ మాయందే:

మీయింట అడుగుపెట్టాము: ఎదురుగా మీనాయన.. మీతాత ముత్తవలు:

మీ నాయన, మొగము అంతజేసుకుని.. తలిదండ్రుల వంక జూసి..: అదుగో నేను చెప్పలేదా- అన్నాడు! మీనాయన వేత్తరా!

మాచెల్లెలిసి.. మిమ్మల్ని విడిచిపోలేక కదులుదామనడం.. నిలిచిపోవడం.. అలా పది పొద్దులు గడచినవి: యిహ, ఎట్టకేలకు ఊళ్ళో ఉత్సవాలు దగ్గిరపడ్డుతూండటంతో.. ఎలాగయితేనేం, ఒకనాడు.. అటు జూసి, యిటుచూసి, తబ్బిబ్బడి తారాడి.. అమ్మా, లక్ష్మమ్మా!.. నేవెళ్ళిరానా!.. అనడం బ్రహ్మప్రళయం అయిందనుకో. మీ అమ్మగాని,



జ్యోతి దీపావళి సంచిక వ్యాసాల పోటీలో బహుమతి పొందిన విద్యార్థి శ్రీ వి. వి. సత్యప్రసాద్

ఆ సందర్భంలో.. రవంత బలవంతం చేసినా.. పోనీ, మాటవరసకన్నా- అదేమిటన్నా! అప్పుడే ఏం తొందర, పెండువు గానిలే- ఉత్సవాలంటావా! యిక్కడనుంచి మ్రొక్కితే స్వామి స్వీకరించడా.. అలా అన్నట్టాయెనా అక్కడ పీఠంవేసుక్కూచునే వాడినే. కాని, మీఅమ్మ అనకపోగా, పెద్దవాడా!.. వచ్చి.. ఎన్నాళ్ళయిందో.. ఎన్నడూ ఊరువిడిచిన వాడవు కావు! పోయిరా.. సాలుకోసారి వచ్చి- పిల్లవాళ్లను చూసి పోతూండు:- అన్నది: మృదువుగానే అన్నాదనుకో, కాని.. నాకు చెంప పెట్టుగా తగిలింది.

[సశేషం]

# సరసమైన ధరలు

బట్టలకొట్టుముందు "ఇక్కడ బట్టలు సరసమైన ధరలకు అమ్మబడును" అని వ్రాసి వుండేది— నా చిన్నప్పుడు.

అనాటి ఊహలో :

ఆయన కొట్లోకి వెళ్ళగానే "పెళ్ళి నడక కాకపోతే వొక్కగంతేసి లోపలకి తగలడకూడదటయ్యా !" అని ఆహ్వానిస్తాడు కొట్టువాడు,

"ఇక్కడ కూర్చునేటందుకు బల్లేనా లేదు." అని బిల్లు చెల్లించే గల్లాపెట్టి మీద కెక్కి కూర్చుంటాడు వొచ్చినాయన.

"ఏడిశావ్- లోపలికొచ్చి ఏం కావాలో చూసేడు," అని ఆయన చెవి పట్టుగుని లోపలికి తీసుకెడతాడు కొట్టువాడు. "ఏదీ- ఆ పైవరసలోవుండే, ఆ గళ్ళతాను తియ్" అని కొట్టువాడి చొక్కా బొత్తములు వూడదీస్తాడు.

"నాజెంబట్ట. మొన్ననే వొచ్చింది. ఒక అరతాను చించనా ?" అని కొనే ఆయన మొహాన కండ్లజోడు వూడదీస్తాడు.

"గజం ఎంత ?" అని కొట్టువాడి బొద్దునున్న పొడుండబ్బీ లాగేస్తాడు.

"రెండున్నర" అని కొనే ఆయన కణతలమీద తన చేతివేళ్లు మడుస్తాడు. "ఇచ్చే మాట చెబుదూ" అని కొట్టువాడి చెవి మెలెడతాడు.

"వో పావలా తగ్గిస్తాలే." అని కొనే ఆయన నెత్తిమీద మొట్టికాయ తగిలిస్తాడు.

"ఆ అర్ధా తగ్గించి రెండురూపాయలు చెయ్యరాదూ?" అని ఆ మ్మే వాడి రెండు బుగ్గలూ సాగదీస్తాడు.

"తాను మొత్తంగా కొంటే. మరో అణా తగ్గుతుందేమో. అంతకంటే నావల్ల కాదు" అని కొనేవాడికి తొడపాశం పెడతాడు. "కాతాగాదు, డబ్బిస్తున్నాను- ముప్పావలా తగ్గితే:తానంతా తీసుకుంటాను," అని అమ్మే వాడి కళ్ళల్లో ముక్కుపొడుం చల్లుతాడు. "అవెనకటి కాతా అల్లానే వుండిపోయింది. ఆడబ్బు కూడా చెల్లించారంటే. పదణాలు తగ్గిస్తాను," అని కొనేవాడి పొట్టమీద గుద్దుతాడు.

"సరేలే,- ఇదీ చిట్టాలో వేసుకుని అర్ధరూపాయ తగ్గించు." అని అమ్మే వాడి భుజం పైకెక్కుతాడు.

"సరే,..ఈతాను వుంచుతాను. సంక్రాంతి నాటికేనా డబ్బుచెల్లిస్తిరా బ్రతికిపోతాం." అని కొనేవాడిని కిందపడేసి- లేపి నిలబెట్టి, ఒక్కతాపు తన్ని బైటకి గెంటుతాడు. కొనేవాడు పోతూ-పోతూ, అరుగుమీద వున్న దిండు, చాప, సిరాబుడ్డి, తీసుకుపోతాడు.

కొట్టువాడు మనిషినిపంపి, వాటిని మళ్ళీ తెచ్చుకుంటాడు.

—బుచ్చిబాబు





# వనవాసి



## మల్లాది రామకృష్ణశాస్త్రి

(గత సంచిక తరువాయి)

అనగా..అమ్మా!- మళ్ళీ మాడుపూరు రావా.మాగడపత్రొక్కవా? అన్నాను:

అన్నా. ఇక్కడచూడపోతే వీరూపెద్దవారైనారు. ఇంతకాలమూ అంటావా.- అది నాబుద్ధిలోపం!-యిఖనైనా చేసినతప్పుదిద్దుకోవద్దా?- మీ రాపగాతి వైఖరి నీకు తెలిసిందే కద- వారు మళ్లీ ఎప్పుడు సంచారం పోతారో,- ఎప్పుడు ఇంటిమొగంచూస్తారో- అది,- వారికే తెలియవలె.

పెద్దవాళ్ళను, వాళ్ళ మానానికి వాళ్ళను వదిలి, బుద్ధి పుట్టినప్పుడల్లా పుట్టింటికి

రావటం గణ్యతగా ఉంటుందా ?- ఆయన అటుపోగా, చూసి, ఈవిడా బయలుదేరింది! భగవంతుడు, ఒకరి కొకరిని తగినవాళ్ళనే ఒనగూర్చాడు !- అని యిక్కడివాళ్ళు ఆడి పోసుకోరా ?- దైవం రక్షించి,- వారుయింటి పట్టునే ఉన్నారనుకో-యిక ఆ ప్రమేయమే ఉండదుకద !-

యింతకూ,- నాకు రావాలనిలేదు :

ఎన్నటికీ !-
నీమీద కోపం కాదన్నా !-

నా తలిదండ్రులకూ తోడబుట్టిన నీకూ, నామీద అపేక్ష ఎన్నటికీ పోదు : చూడా లని అనుకున్నప్పుడు - రాకపోరు-అందుకు ఏ ఆక్షేపణా లేదు :

కాని, నే నెలా రాను ! ఏ మొగం పెట్టుకుని మాధవస్వామిని చూడను !- నీ నోటి వెంట ఎప్పుడలాటి మాట పుట్టిందో, అప్పుడే నాకు, ప్రాప్తం తీరింది.

యింతవరకే నోచుకున్నాను ! ఆయెపో- అన్నా !- పసివాడికి పదారేళ్ళు రాగానే పంపుతాను ! వెంట ఉండి-స్వామిదర్శనం చేయించు !- వీనికన్నా,- స్వామి వారు నిండు తేజముతో దర్శనమిస్తారో,- లేదా !- మరేతీరున గోచరులౌతారో - వాని ప్రాప్తమేమో !- అది అప్పటిమాట !-

యిప్పటికి, నాకిలా తోస్తుంది- అన్నా !-
మీ యింటపుట్టిన ఆడపిల్లలకు, యిక మీదట,- యిలవేలుపు మాధవస్వామి వారు కారు ; ఆ పుణ్యము నావరకే-

నా కన్నులలో .తళుక్కుమన్న మువ్వ గోపాలమూర్తిని, కన్నవారిపై మక్కువకు, జతచేసి,- ఆలయ ముఖమంటపంలో, కొలువుదీరమని వదలివచ్చినాను: ఏల,-

మాధవస్వామివారికి- చేత బాపను మిగిలినది.

మీ చిన్ని మేనల్లునికి వెన్ను చలువ లోపించినది !

మా తరాన మరి,- మాయింట ఊయేల వేయము :

ఇక,- ఆ మురిపెము మీ యింటనే-!

మాధవన్నా- నట్టింట ఆడపడుచు లేక పోయెనే అనే చింత నావారికి ఉండరాదు ! మన గ్రామం తిరిగి చేరుకోగానే,- మంచి ముహూర్తాన ఒకరింటి అల్లుడివైతే,- మళ్లీ యీ రోజులనాటికి, మన అమ్మా నాన్నా,- మనుమరాలినెత్తేరు: అవునన్నా- నా అనవాయత నీకురాదు: నీకు ఆడపిల్లలే !-

నా మేనగోడలికి నగలూ నాణెములూ అక్కరలేదులే: పారాడే యీడున,- ముఖ మంటపములో వదులు !

అకడ, నేనిల్లడగా నిలిపిన బాల గోపాలుడు, ప్రాకులాడుతూ చేరవచ్చేను ! స్వామి వారితో కలసి ఆడుకొనేనో, ఆరాధించేనో:

అదే,- నామేనగోడలికి, అక్కడ నేను దాచబెట్టిన నిక్షేపము ! సరేనా ? సంతృప్తియేనా ?-

అన్నా-నీఊహ;నాకు తెలుసును——

నీ కూతురు నా కోడలయేనా- నీతో వియ్యము నాకు సమ్మతమేనా ? సంశయానికి సమాధాన మిదే-!

నీ మేనల్లుడు-ఎవరిని చేపట్టేనో- ఎందరిని చేపట్టేనో,- ఎప్పుడా గడియవచ్చేనో,- తేల్చేది మనం కాదు, దైవం !-

చిగురుకొక్క మాట !

మనకు యిక పలుకరింపులు లేవు !

బాంధవ్యం త్రుంచివేసుకోవటంకాదు:



మనసు చిక్కబట్టుకుంటున్నాను.

నాకు దూరమైన స్వామివారు, ఏనాటికైన నాచిన్నవానికి- ఏతీరునగానీ,- ఏపేరునగానీ, శంఖచక్రభూషితులై సాక్షాత్కరించేరో,- ఆ నిమేషమున యీ అంకిలి తొలగేను. ఆ దివ్యముహూర్తముకోసర మెదురు చూచేనన్నా!- సందె గోవిందా !- యిక సాగిపో !-

అన్నదిరా - అన్నా ! - యిదీ మనకథ:-

వెస్వేళ్ళకూ,- నీకు పదారేళ్ళ !-

మీ అమ్మ అనాడు నిర్ణయించిన సుముహూర్తము:

నాయనా,- నీ అనుభూతి ఏమి ?-

నా అదృష్ట మేతీరయ్యేనురా - అని నాడవ్వా !,

ఇక, నాతీరు —

మనసున కమ్మిన మబ్బుతొలగినదికాని- కనులముందు మసక మాయలేదు : నిండు కొలను - ఉన్నట్టుండి ఉద్ధృతముగా కలగ బారినట్లు,- వెన్నెల గుభీలుమంది ! వెలుగు కొండకట్టింది ! కొండగట్టిన వెలుగు, గోగు పూవంత కొడిగట్టింది! ఆ వెలుగులో,-కొండ కొమ్మన వేయి పడగలేసి కదిలింది చీకటి, చీకటి సోకి కొలనులో తామర తఖకు మన్నది: తెలివికి మెలకువ వచ్చింది! మా మేనమామకు నాగోడు విన్నవించినాను! వారు, ఒక్క నిమేషం - మౌనం వహించిన వారై,- మాటకోసం తడుముకుంటున్నట్టుగా, ఆలాపనగా,- యిలా పలికినారు !

మీ అమ్మ దీవెన నిన్ను వెన్నాడుతూన్నది!

అదే వరమై గురుతుపొడసూపింది, కాని గురి కుదరలేదు - వెరవూ,- తెరవూ, చూపించే గురువు దొరకవలెరా !-

ఎక్కడని వెదకేవు. ఎవ్వరనివెదకేవు. తరుణము రావలెరా.

వారే తమకు తామై దరిశెన మీవలెరా ?

మామ మాటలతో నాకుతపనహెచ్చింది- ఒక్క గడియ అక్కడ ఉండనన్నాను. గురువు రాకకు నిరీక్షించుతూ, పడిగాపులు పడిగాపులు పడి వుండలేనన్నాను. ఎమరేగేనన్నాను ! వారు ఎవ్వరైనగానీ- దర్శన మనుగ్రహించేందుకు, తారసిలే వరకూ,- తిరుగుతూనే ఉంటానన్నాను :

మామామ నా మొగము వంక చూచినాడు ! వారిపలుకులు వినిపించుకునే స్థితిలో లేనని గ్రహించి నాడు : కొంతసేపటికి గ్రుక్కతిప్పుకుని,-

తల్లి పోలికను పుట్టినా,- తండ్రి దారిక తప్పలేదు - కానీ, నాయనా,- ఎన్ని తరాలుగానో,- సామాన్యంగా,- సంసారపక్షంగా,- మా కుటుంబం, వర్ధిలుతూ వచ్చింది ! మీ నాయన,- మాయింటికి అల్లుడయినాడు ! మాదశ మారింది ! అనిర్వచనీయమైన ఆనందం,- మా లోగిలిలో కాపురం పెట్టింది ! మీరు మీ యింటికివెళ్ళిపోయినా,- ఆదిలో రవంతబాధ అనిపించినా,- ఆపైన యథాప్రకారముగా నే ఉన్నాము ! మీరందరూ కళ్ళ ఎదుట ఉన్నట్టే ఉంది :

మీ అమ్మ అనాడు అన్నట్టే,- అక్షరాలా,- నేటివరకూ జరిగింది : పదారేళ్ళవాడవై మాయింటికి వచ్చావు : యింటిల్లిపాదికీ,- పట్టం గట్టుకున్నట్టనిపించింది : బౌనోయీ-

ఇంట, బిడ్డ ఎదిగేసరికి, అల్లుడు వెదుక్కుంటూ వచ్చాడనుకున్నాను ! మీఅమ్మ





చెప్పి పంపిందనుకున్నాను ! మా అక్కమ్మ తల్లికి మామీద ఆనాడు అగ్రహంవచ్చినట్టుగానే యీనాటికి అనుగ్రహం వచ్చిందనుకున్నాను ! యివాళ నీ పుట్టిన పండుగలా చేసినట్టుగానే,- మంచిరోజుచూసి కన్యాదానం చేదామనుకున్నాను : మాఆడపడుచునట్టింటికి యీరూపేణా వచ్చేననుకున్నాను. మా తలిదండ్రులకు మల్లేనే,- మనుమల్ని ఎత్తుకుని ఆడించే భాగ్యము నాకూ లభిస్తుందనుకున్నాను : ఎన్నో అనుకున్నానురా. ఏం లాభం ! నేననుకున్నతీరున జరిగేటట్టు లేదు ! నీకు, మన ధ్యాస లేదు!, తేలిపోయిందికా !-

కానిలే : మరి, నిన్ను ఆపను: నాపిల్లను చేసుకోమనీ, యింటిపట్టునఉండి పొమ్మనీ- బ్రతిమాలనూ, బలవంతమూచేయను :

అవునురా: నీ వాలకం చూడబోదామాఅంటే పర్యాయతీని, నీవు రాగివయ్యేవో, విరాగివయ్యేవో,- ఊహించడం అశక్యం !

కన్నాను కాని, దాని అదృష్టానికి నేను కర్తనా ?- ఊఁ,- అన్నింటికీ మాధవుదే ఉన్నాడు :

నీ తరణోపాయం నీవు జూచుకో—

ఏనాటికైనా,- నాకాయోగం ఉంటేమళ్ళీ నిన్ను కళ్ళజూస్తాను :

యిలా అని,- నన్ను కౌగలించుకున్నాడు;

మాధవా : అని ఎలుగెత్తి పలికాడు :

యిక యిద్దరమూ, తలోదారీ !-

నేను,- అంతసేపూ ముఖమంటపంలో ఉన్నా, మరల కన్నెత్తి, స్వామివారివంక చూడలేదు- నాకు ఆఊహే కలుగలేదు. మామామ కనుచాటయేదాకా ఆవంకచూసి,-

అనాలోచితంగానే అటుమ్రొక్కి,- ఎటు బోయినాను !- మాతాతగారింటికి కాదు ! కొలను దగ్గిరకి !

అక్కడ కూర్చున్నాను :

ఆనాడు-, మానాన్నా, అక్కడే కూర్చున్నాడు కాబోలు :

అలా,- మానాన్న కూర్చునిఉండగా,-

మా అమ్మ- అక్కడకు వచ్చింది- చూసింది - చేయెత్తి మ్రొక్కింది- నేను పుట్టకముందు జరిగిన కథ - నాకళ్ళలో బొమ్మకట్టింది-

మా నాన్న,- హిమగిరిశృంగాన తపశ్చర్యలో ఉన్న సదాశివుడు. మాతల్లి,- వకుళమాల చేబూని,- సపర్యకు సాగివస్తున్న ఉమ :

ఆయన కదలిపొంగుమీద,- శయనించిన నారాయణుడు,- ఆమె కడలిపట్టి-

మాతండ్రి- వేదాలరూపు తొలివేలుపు-కై మోడ్చినది- నాదమయి-

ఏదో కోయిల కోయన్నది.

ఎటనో తుమ్మెద ఝుంకరించినది-

నా తనువు - బంభ్రమించినది-

తంబుర తీగెలు, మందమందముగ, అలసములుగ మ్రోగినట్లు,- ఏ రవము నకా రవము !

మనసున కలయగ్రమ్మిన నాదసందోహము, వినుకలికి దూరదూరమై, మౌనము అలకొట్టినట్లు, మాయమైనది: కనులరవిచ్చుకున్నవి :

ఎదుటనున్నది ఎవరు?- మా మామ కూతురు తిమ్మక్క ; తానొక్కతే రాలేదు: చిన్నదీ సరసను ఉన్నది:

స్నా- ఊరు అక్కడికి తరలి వస్తున్నది: యిక్కడ ఉండటం ఊరివారికీ నాకూ మంచిదికాదేమో. దైవము కానరాడాయెనే అని అల్లాడే అకించనుణ్ణి.. నలుగురిలో ఒకణ్ణి.. నాకీ మరియాద లేమిటవ్వా—

నీవూ. - చూస్తూ ఊరుకున్నావు కాని.- నన్నాదుకోవైతివికద! అవ్వా.- ఆనాడు మాతండ్రి నీకు విన్నవించుకున్న తీరునే.- నీకు మనవు లిచ్చుకుంటున్నా. నీ కొక్కరికే చెప్పి పోతున్నాను: నాసాధన, ఫలించేందుకు.. నీవు తోడుకావాలి!- అవ్వా ఎన్నడు మరల నిన్ను కళ్ళచూసేనో—

అలా.- విన్నపాలు పలికినవాడై.-

గంగవ్వకు దూరమై, కన్నవారికిదూరమై తనమీద మక్కువలున్నవారికి దూరమై, తరలిన అన్నమయ్య.- తనలో తానుగా.- తనసాధనే మార్గముగా.-ఆనందమే వాపీజలముగా.- అలసటలేనితనమే- వటచ్ఛాయగా, తమకమే తాంబూలముగా.- తానే అన్నమై అన్నాదుడై, గానయోగాన, ఎన్నిపొద్దులు వడచెనో ఎన్ని సీమలు గడచెనో.- గమనికలేక- తన గానమెవ్వరాలకించిరో.- ఎందరు చేతులెత్తి మ్రొక్కిరో.- ఎవ్వరెవ్వరాతని పేరున పిలచిరో, ఎన్నెన్ని తీరుల పెద్దరికము లిచ్చిరో, గురుతించక.- తాను వలదన్ననూ.- కీర్తికాంతతో తగులాటము తనకు తప్పలేదనీ.- తనకన్న ముందుగా.- ఆ వన్నెలాడి పయనించుతున్నదనీ, స్ఫురణలేక - పోగా, పోగా—

ఏదో ఒకనాడు - ఏదో తావున.- తన ధ్యానలో, తన ఆసలోతానుండగా, ఎక్కడో దూరాన.- ఏదో దిక్కున.- భ్రమరనాదము తోచి.- తానా లక్షించగా, తాను ఆకలింపంగా.-" తనకోసమ్మే, ఆ నాదము తరలి వచ్చినట్లనిపించే - మరింత అలకించంగా.- తానే పరవశమై, దానికి వశమై.- అదిక్కు ఎంచి సాగిలి మ్రొక్కినవాడాయెను!

పాలకీలోపయనం జేస్తున్నవాడు, సాళువ నరసింహుడు! విచ్చుకత్తులవారు, ముందు పరుగు తీయగా, బల్లెములవారు, వెనుక అంగవేయగా.- బాకుపట్టిన వారు, వెంట తరటుపోవంగా.- బోయల నాదాన రాచనడకలుగా.- పాలకీ, ఎదురురాగా.—

ముందు పరుగులవారు, అలా సాగిలపడిన వానిని చూసి.- ఎవరో ఆపన్నుడని ఏలికకు మనవులు సేయంగా.- వారు సముఖానికి రప్పించమని తల ఊపగా.- వారు అన్నమయ్యను లేవనెత్తి.- బ్రాహ్మణుడని తెలిసికొన్నవారై.- తబ్బిబ్బై, మాటామన్నాజేసి.- తోడుకొనిరాంగా.- అన్నమయ్యను జూసి.- నరసింగరాయడు. - బోయలను గదిమి పాలకీదిగి.- వినయాన చేతులు జోడించి.-

అయ్యా మీరు బ్రాహ్మణులే- మాకేల మ్రొక్కినారు- యీసేత మాకు సేమము కాదే- అనంగా, అన్నమయ్య-

నీకు మ్రొక్కలేదు- అనంగా, అంతకు మేలాయె- మరి, మీ ఆర్తి ఏమి ?-

అన్నమయ్య, నవ్వు మొగం చేసుకుని-

'అందలాన పోయేవారు, అర్థంలేని ప్రశ్నలు అడిగేవారని ఎరుగనే, నాది.- ఆర్తికాదు - ఆనందం!

ఓంకారము నలుమొగాల నినదించింది: ఓహో, అని, సాహో అని, సాగిలపడినాను: యీ నాదమూర్తులకు నమస్కరించాను: అంతమాత్రమే!- దేవరకు, తెలియజెప్పినానుగా, ఇకమీ దారిని మీరుపోయేరా?'



ఆ పలుకులు విన్నవాడై, నరసింగరాయలు.-ఎరుగని ఆనంద మొక్క నిమేషమనుభవించి.- అంతలో.- తాను మహీపతి నని, ఎదుటనున్నవాడు ఎవరో సామాన్యుడనీ.- ఛాందసుడనీ, గురుతుకుతెచ్చుకుని.- ఎక్కుబెట్టిన వింటివలె శివులుబోయి.- రాజసం ఆవహించంగా.- చేరువనున్న లెంకతో.- 'ఓరీ.- ఆ బ్రాహ్మణుని, మన కొలువుకు దయ చేయమనరా, - పలికినది., పెనుగొండ రాజధానిగా కనుచూపుమేర - పరిపాలన జేసే సాళువ నరసింహరాయలని మనవి సేయరా - మన ఘనతకూ.- వారి గరిమకూ అనువైన మరియాదలూ మన్ననలూ సేయంగలవారమని ఎరుక సేయరా - వారి అంగీకారము, తృటిలోమాకు విన్నపంజేయరా- వారు.- ఆసీనులు కాంగనే.- తరలిపోయేమురా....' అని సెలవిచ్చినవారు కాగా,-అన్నమయ్య రాయలవంక జూసి.- పకపకనవ్వి—

సాళువ నరసింహ మహీపాలవరులు మీరా?

మేలు!, మీ సిరులు పెంపొంద వలె!.- మీ పడిగాపులవారికి మీరు సోదరులుకావలె- మీ చూపులు మీ సీమకు వెన్నెలలుకావలె- ఏనాటికైన అయేనా?— ఏమో! వానికెరుక!-

అందరూ దొరలల్లె అందాలెక్కితే మోసేదెవరయ్యా?

సాటివాని మూపెక్కే సామంతము వీనికిలేదు., అది.- మీ నొసటి వ్రాలేలే-

మీమరియాదలూ.మన్ననలూ, నాకొరత తీర్చలేవయా, రాయలూ.- నాకోరిక మన తలకు మించినది. ఔనయ్యా, మహీపతివి.- మణులిచ్చేవు.- మాణిక్యాలిచ్చేవు.- పరివారమిచ్చేవు, పదవులిచ్చేవు.- ఊడిగానికి పశువుల నిచ్చేవు- భళానే భళా!

అప్పుడు వీనిపని ఏమౌను? కాల్సేతులు కదలించుటకైన నీ కనుసన్నల ముగుదల కావలెనే!- నీ చిరునవ్వులకు చిత్తము-చిత్తమనవలెనే- నీ కనుకెంపులకు గడగడలాడవలెనే! సాగిపో-సాధించుకో-! అని కాని రాని గురువులు కట్టడచేసినారు: అది నీకూ గురువాజ్ఞ! సాగిపో- పో—

అని, చనవుగా, మృదువుగా, అన్నమయ్య పలుకంగా.- ఎన్నడూ, విపన్నుల విన్నపము లవధరించెనేకాని.- వినమ్రుల మనవులాలకించెనేకాని, తన సన్నిధిలో మరొక్కడు ఠీవిగా నిలువగా, తన ముఖాన ఒక సామాన్యుడు బింకాన పలుకాడంగా, కనీ వినీ ఎరుగని రాయలు.- తన పుణ్యమంత తామసించి, తన దురితమంత, మోహరించి తన నేరని తనమంత నివ్వటిల్లి.- ఎదుటనున్నవానిని, కనులార కబళించి.- మూరురాయరగండము వేయించి కదలకుండ చేసి.- కన్నులు పొడిపించి గగ్గోలుపరచి.-

---

## రచయితలకు మనవి

"జ్యోతి"కి రచనలు పంపేవారు అవి నిరాకరింపబడిన పక్షంలో వాటిని త్రిప్పి పంపగోరితే రచనలతోపాటు తగినన్ని స్టాంపులను జతచేసి పంపించాలని మనవి. రచనలతోపాటు కాక తరువాత స్టాంపులు పంపవద్దని, అట్టివారికి రచనలు త్రిప్పి పంపడం కష్టసాధ్యమని గుర్తించాలనికూడా మా విజ్ఞప్తి.

—మేనేజింగ్ ఎడిటర్.

గొంతు నులిమించి, ఆక్రోశింప జేసి,- ఆ ఆక్రోశమే, తన ఆనందముగా,- ఆ ఆనందాన ఒళ్ళుతెలిసి, తన ఎదుట తన ధ్యానాన తన గానాన తామున్నవానిని, తనివిగా తిలకించి,- తన గొంతు తన వశాననుండక,- ఓహో అనంగా,- తన హస్తములు తన ఆజ్ఞకు నిరీక్షంచక,- తనకు వశంవదములు కాక,- ఎదుటనున్నవానికి జోతలీయగా,- ఒక్కక్షణము తాను తా ను గా క, మంచికి పోయి, మనిషై,- అంతలో గానమాగిపోగాం భుజకీర్తులు తడుముకొని, బుసకొట్టి,- ఊసాగనీ- యిది ప్రభువులఆజ్ఞ, పాడవయ్యా బ్రాహ్మణుడా--' యిలా ఏలినవారి మాట దూకుడున పోవగా,- అ ం దు కు, అన్నమయ్య- ఒక చిరునవ్వు !-

రాయల కనుకెంపు- అందుకు మరొక్క చిరునవ్వు-

రాయల హుంకరింపు- అది అన్నమయ్యకు చూడ వేడుక-

రాయలూ,- బ్రాహ్మణుని ఆజ్ఞాపించు కాలము రాలేదు ! రాదు ! అది మీకే సేమము :

నా గానము .- నేను నేర్చినదికాదు : కానరానివారి దెవ్వరిదో,- నా గొంతు నా చెప్పుచేతలలో లేదు : పలుకమని నప్పుడు పలుకదు !

ఇది దర్పముకాదు- తథ్యము.- నీమనసు వీనిని హింసించినది - వీడు, ఘనుడుకాడు, గాయకుడుకాడు ! నీటిని మరగబెడితే,- నేయి అవుతుందా,- కాకిగొంతు నులిమితే కోకిల అవుతుందా,- గోరెంత పెరిగినా గొడ్డలి అవుతుందా,- గోడకు నామం మెత్తితే గోవిందుడౌతుందా ?- కాదుగదూ ?- మన స్థితీ అంతే....

నీవు నోచినదానికైనా నేను నోచలేదు ! నా గానం యింతవరకూ నేను వినలేదు ఔను !

వారి ఉపదేశం వినవచ్చింది ! గొంతు విచ్చుకున్నది ! గానము సోనలు గట్టినది ! అంతవరకే తెలుసును ! ఆపై ఎరుగను ! కాని, వాడెవ్వడో, ఎక్కడున్నాడో తెలుసుకొనవలెననే తపన,- వేదన,- అందుకు గురువులు చూపిన మార్గ మీ గానసాధన ! వినగా వినంగా,- వానికేనాడు దయ కలిగేనో,- నడువగా నడువగా,-ఎన్నటికి, వాని దరిదాపులకు చేరుకునేనో....?

ఏ రూపాన వెలసినవాడో- ఎక్కడ తేవిణీ వేసినాడో- ఏ కళనున్నాడో, నా కన్నుల కేవేళ గోచరుడ యేడో, నా సేవ లందు కొన, వానికి ఏప్రొద్దుల మనసయేనో తన్నేతీరున పిలిపించుకునేనో, నన్నేగోమున తనవాని జేసికొనేనో, అది,- ఆ లీలా వినోదుని దయ!

ఏమోకాని,- ఉట్టిమీద వెన్న దుత్త పెట్టి, ఊరెల్లా నేతికి త్రిప్పిస్తున్నవాడు ! ఒకచోట నిలువనీయడు మనసెవ్వారి మీదికీ పోనీయడు ! అన్నీ మరపించాడు. కాని ముచ్చటకైనా మురిపించడు: కానరాడు కాని నన్ను వదలడు : యిదీ మావరస !

పాపిట తీసుకున్నాను యింటాయనా అంటే, నాకింకా దొరసాల కాలేదే యిల్లాలా!' అన్నవాడట వెనుకటికి యిల్లాంటి మహానుభావుడే ! యిదీ మా సరసం ! 'కొత్తగా వచ్చింది కోడలని కోకిలా అని ముద్దుచేస్తే, కూనిరాగందీస్తూ కొమ్మెక్కి కూర్చుని, కోం అంటే పోం- అన్నదట !' తాను దేవుడైనందుకు నన్ను







దివ్యంగా వేధిస్తున్నాడు ! కానీ,- ఎన్నటికైన నాచేత పడడా,- యిన్ని ఆటలూ నేనూ ఆడించలేనా ?-

ఆఁ- ఆఁ- ఏమి యీవెర్రి !—

ఆడించేది,-వాడా,- నేనా ?-

వీని మాయ మంచిగానూ !-

నా భ్రమత వాని మమతగానూ,

నీవున్న తావున నీవుండి, నన్ను నాకు గాకుండ జేసినా వోరయ్యలూ,- ఇంతలు చేసినానని, నేతకు మురిసేవుగా,- దీని సొగసు నీ కెఱుకలేదు- సొక్కులు ఎక్కబెట్టి చిక్కులబెట్టినా,- నేను నీకు దక్కనో ఎమ్మెకాడ !

దక్కించుకొనేను ! యిక ఎవ్వరుగానీ, ఎవ్వరి తేరకాడనిరో, మారుబలుకువారు, నీ పేరున నిన్ను పేర్కొనరులే ! ఈతడా, తాళ్ళపాక అన్నమయ్యనేలే దైవరాయడ నేరులే ! అదే నీ బింకమునకు బిరుదయ్యేనులే....'

'తాళ్ళపాక అన్నమయ్యా'— అని వినంగానే, నరసింహరాయడు. అయ్యా! అయ్యా! అని ఎలుగునటోయి. నేటికి నిన్ను జూడగలిగినానా! ఎన్ని సీమల తిరిగినానయ్యా!— అయ్యా!— నీపేరు విన్నాను! నీవు నావాడవే అనుకొన్నాను! అనుకున్నంతలో.. నీవు కాల్నడకను సంచారము చాయగా, నాకు అలసట తోచింది! నీదరి జేరని ఆకలిదప్పికలు. నన్నావరించినది! నీ ఉపవాసము, నాకు ఉపదేశము చేసినది! నీ దీక్ష నన్ను దీవించినది! నీ కదలికతో నేనూ కదలినాను: నిన్నూ నీ గానమునూ ధ్యానించుతూ ఉన్నాను: కోట పెంపొంది నది, కొలువుతీరిక పెంపొందినవి: రాణువ హెచ్చినది: రాజసమూ రెచ్చినవి: కాని. అవేమో ఎందునా తృప్తి ఎసగకనేపోతిని. నేను నాకేవో లోపముజేసికొన్నట్టు లనిపించింది. ఏదో వెలితి కనిపించింది! గురువుల వారికి. విన్నవించుకున్నాను: వారు సెలవిచ్చినారు కదా—

'రాయలూ.. కూర్చున్నచోటికి కోయిల రాదు!

ఏలినవారి సెలవైనదని రా చిలుక వలుకదు.

రాజసాలు కోటలో వదిలపరచి.—
ఏనాటిపుణ్యమో ఎదురయేదనుక

సాగిపో.— నీకోర్కె సాధించుకో....

వారుపలికినట్లుగానే. సాగివచ్చాను. గురువుల కృప నాకు తోడైనది. దారిచూపినది' వెదుకబోయినవారు ఎదురైనారు! మీరు యింతకుముందు సెలవిచ్చినట్లే.— యిక మీరు ఏ తీరున నన్ను నాదరించేరో.. ఏ ప్రొద్దుల నా సేవలందుకొన మనసయేనో మీ చిత్తము: పాలకి దిగినాను! బంటునై. మీ వెంట నడచేను:....'

నరసింహరాయలు. యీ తీరున వలుకంగా అన్నమయ్య.వికవిక నవ్వి.- 'తాదూర సందులేదే- మెడకి డోలు ఎందుకు?— రాయలూ.— నీదీ రాచపుట్టువు: పేదరికమునకూ మీకూ సగమెరిక! యిప్పటికిది ముచ్చట అనిపించి.— నా వెంట నాలుగడుగులు పెళ్ళినడకలు నడచేవుపో.— నీ వయారము చూచుటకు కాదు.— నేనింతదూరమూ సాగివచ్చినది? నేను వాని లెంకనయ్యా - నాకు నీబంటు తనమేలనయ్యా!-

'రాయలూ.— ప్రభువులు మీరు!— వీరులు!- రణకర్కశులు!- భక్తి-మీ కొక అటవితువు!— సాటి నరుణ్ణి పెద్దచేయడం, గౌరవించడం.. అదో భ్రమ! వినయం ఉట్టిపడేట్టు పలుకడం- వేడుక!- మంచితనానికి పోవడం తెలిసి చేసుకునే ఆత్మవంచన!

'ఎదుటివాని నెత్తురు కళ్ళజూచి. కలకల్లాడే మీకు. ఓదైవమనీ ఓ గురువనీ ఉన్నాడా?— ఏమో.— మన మెరుగము! విన వేడుకగా పలికింది చాలుగాని.. దిగినట్టే ఆ పాలకి ఎక్కి నీ త్రోవను పో.—'

రాయలు పాలకి ఎక్కినదీలేనిదీ. అన్నమయ్య గమనించలేదు- తాను ముందుకు సాగిపోయినాడు:

## అచ్చుతప్పు

గత సంచికలో "పంచపదులు" శీర్షిక క్రింద అయిదవ పద్యానికి హెడ్డింగ్ "ఇక్కడంతా క్షేమం" అని చదువుకొన ప్రార్థన.





రాయల వెంటనున్న పరివారము కనుకెంపు మీద నున్నది! ఆ వీరులు మనసున కత్తులు దూసినారు! ముందుకు ఉరికేందుకు, తమ ఏలినవారి నలా ఈసడించిన వాని సిగ పట్టి నిలిపేందుకు.. ప్రభువులు కనుసైగతో అజ్ఞాపించరేల?-

రాయలు ఏ స్థితిలో ఉన్నాడు?

కోపములేదు- తాపములేదు-

మోమున ప్రసన్నత- పెదవిని చిరునవ్వు-

జపరాలి చేతి జపమాలలాగా,- తప్పిచెప్పినాడు! పాలకిబోయలతో.- 'ఓరీ.. అందలం ఎత్తండి- అడ్డ త్రోవనుపోయి.- వారికి, కానరాకుండా.- దారిపట్టి.- కూతపట్టండి! హుటాహుటి పోయి. కేశవస్వామి వారి సన్నిధిలో, ఆగండి! వెనుదిరిగి చూడరాదు! వెటకారం తలచరాదు! పాలకిలో స్వామివారున్నారనుకుని, పరుగు మానిభక్తిగా నడిచిపొండి: మేమూ వెంటనే ఉన్నాము!-

పాలకి సాగిపోయింది. రాయలు తలచినది కొనసాగినది! తాను బ్రతిమాలినా, పదము లంటినా, అన్నమయ్య చలించడు: పెనుగొండకు రాడు! అన్నమయ్య లేనిదే, తాను పెనుగొండకు పోడు! కనుక యిదే ఉపాయమని తోచింది! చిలుకను పట్టవలెనంటే చిలుకనే వదలాలి! తన బోయల ఓంకారమాలించి.- అన్నమయ్య వారిదారి పట్టక మానడు కద!

రాయలు అనుకున్నంతా జరిగినది!

విసవిసపోతూన్న అన్నమయ్యకు..

ఓంకారము దారి చూపించినది: దానిని తరుముకొని పోయినాడు: నాదముఆగినది! తానూ ఆగిపోయినాడు:

కలయజూసినాడు: ఆలయము ఖమంటపం!

అటు- కేశవస్వామి!

యిటు- వినమ్రుడై, రాయలు!

అయ్యా! అన్నమయ్యా! మరే సాధన లేక, యీ రవంత అపచారము చేసినానని నేననుకొనుచున్నాను! కాదని అభయమిచ్చి నన్ను చరితార్థుని సేయవలె:

మాకోటలోనికి దయచేయమని, కోరను: పరిచర్యలకు పరివారమును నియోగించను: పదవులివ్వను! ఊడిగానికి పడుచులనివ్వను!

యిది.స్వామి సన్నిధి. మీకు నిత్య ఏకాంతము! మీ సాధనలకు ఆటంకమూ, అంతరాయమూ ఉండదు.

ప్రాతః సమయమున మీదర్శనభాగ్యము మాత్రము నాకు అనుగ్రహించండి: అదొక్కటే నా కోరిక!-

ఎల్లకాలమూ - దైవకృప యీతీరున మాపైన ఉన్నంతకాలమూ - మీరిచ్చటనే నివసించవలె! యింతకాలమూ. కానరాని ఆ దివ్యరూపము.. మీకు. మా సీమలో. కనుల కందవలె - మీతోబాటూ మేమూ తరించవలె - యిదొక్కటే నా మనవి—

రాయల మనవి ఆలించి.. అన్నమయ్య- సాగిపో - సాధించుకో అన్నది అవాణి - అని మననం చేసుకుని,- రాయల వంక చూడనైనా చూడక.- అడుగు ముందుకు వేయగా, రాయలు,

'మీరు కదలిపోవడం, కేశవస్వామిని.- మా దైవాన్ని తృణీకరించినటు లౌను_!'

అన్నమయ్య వినిపించుకొనలేదు!

మా గురువులు. నిన్ను సందర్శించేందుకు విచ్చేస్తున్నారు! ఆగకపోయిన పెద్దలను నిరసించినటు లౌను!'

అన్నమయ్య, ఆగలేదు.

'పట్టి బంధించండి!' అని రాయలు కేక వేశారు: కేక వేసింది - అతడు కాదు - అతని రాజసం! ఆ పెదవులు మెదలలేదు- ఆ ఆజ్ఞ లెంకలకు వినిపించలేదు —

కాని, అన్నమయ్య అడుగు ముందుకు వేయలేదు - పచ్చని మేనివాడు,- పలపలని



నవ్వులవాడు - వెన్నెల కన్నులవాడు - వెడద ఉరమువాడు! - తనముందు తోచి, చేజాపి, అందుకొని, గ్రుచ్చి కౌగలించుకొనె - అతడెవ్వరు?- మెడనున్న తులసి మాల నీ గురువులు రా,- అని జపము చేసినది - ఆ కనులు - సాగిపో-: సాధించుకో, అనీ తళుకు చూపుల దీవించినది —

నాయనా - అన్నారు వారు

స్వామీ - అన్నాడు అన్నమయ్య - నిన్ను వెదకికొనుచూ వచ్చానురా-అప్పుడు- నీది ఒక్క అడుగు ముందైనది!- నిన్ను కనులచూడలేదు - తరుణ మురాలేదు! దానికేం!-

నీకు కావలసినవారిని, జూసినానులే!-

మీ మేనమామ, మాధవయ్య - నేనూ, ఒక తల్లి కడుపున పుట్టలేదు కాని,- మా అనుబంధం అలాటిది!

నన్ను కందాడవారి కృష్ణుడనేరులే—

యీ తులసి పూసలూ, యీ వాలకమూ ఏమనేవో,- యిది మన వెర్రిలే-!-

అది ముదిరి వేదాంతమైతే,- ఆదేందుకు పాడేందుకు ఒళ్లవంగదని,- లేతగానే అట్టే పెట్టాను:

ఆ, దానికేంగాని,-

యింతకూ నే జెప్పవచ్చిందీ—

ఆవేళ,- మీ మేనమామలోగిలి కలకలలాడు తూండగా,- వచ్చాను- ఏమిటి విశేషమన్నాను!

ఫలానా అన్నారు!

ఏడీ ఆ ఘనుడన్నాను!

కొలనిగట్టున తీరి కూర్చుని, కొండ కొమ్మున, గోగుపూసిందేమా అనే మథనలో ఉన్నవాడు- అన్నారు!

ఆహాఁ-అదెంత పుణ్యంకాదు! అన్నాను:

పిలుచుకుని రమ్మని పిల్లలనిద్దరినీ పంపించినారు: అక్కడ ఏమి జరిగినదో,— నీవు అటురాక- ఎటోసాగిపోయినావట!-



ఎవరో ఉపదేశము చేసినట్టు!- ఏదో సాధించబోతున్నట్టు- ఆఁ యిది వారి ఊహలే!-

మీవాళ్ళందరూ,- సామాన్యులుకారురా!-

'నాన్నా - నాన్నా - తాళ్ళపాకనుంచి వచ్చిన అత్తకొడుకు,- రాగాలు దీస్తూ,- ఎటో పోతున్నాడు -!' అని మీ చిన్నమరదలున్నదే,- ఆ చిలక, ఎగిరి గంతేసి చెప్పింది!

పెద్దపిల్ల - పండు ముత్తైదువ నుదుటి కుంకుమల్లే,- సిరులోడే మొగంతో,- నిదురలో పసిపాప నవ్వినట్లు నవ్విందయ్యా! మా మాధవయ్య వీళ్ళను మించినవాడు!-

వినీ వినడంతోనే - ఆహాఁ- అనుకుని,- మెప్పుగా - మేలుగా, తల ఊగించి,- సిగపాయ దూడించి గుత్తగా ముడివేసుకుంటూ తపస్సు తాత తండ్రులదీ,- ఫలితం వీడిదీ:- అంతేకాదురా -? ఒరే కృష్ణమ్మా!- మన ప్రబుద్ధుడు,- ఎక్కడ సంచారం చేస్తున్నాడో,- నీవో ద్రిమ్మరివి - తారసిల్లితే,- గట్టిగా కౌగలించుకోరా!- అన్నాడు—

రావయ్యా అల్లుడా యిలా కూర్చుందాం దారినబోయే బాటసారి తనకు అలసట లేకపోయినా, వటవృక్షం కనిపించెనో,- దానికి మన్ననగా, ఆ నీడను నిలవాలి,- అని పెద్దలంటారు!- ఎందుకు?- ఓవిశేషం లేకపోలేదు!-

మన మనస్సుందే- ఎండలో ఉంటే ఎదుటివాడిమీదికి పోతుంది- నీడనుంటే నిన్నంటి పట్టుకునే ఉంటుంది-

కనుకనే- ఒకచోట కాల్నిలుపనివానికి చేత యిలాటి ఓ జపమాల వంటిదివుంటే చిత్తము చిత్తమువచ్చినట్లు మెలగదు- అందుకో.... కోరిన ఆనందమనుభవించుకో!....

కృష్ణగురుడు.... అన్నమయ్యకు తులసి మాల అందించినాడు! అంతవరకూ బ్రమ్మస్పడి మూగవోయిన అన్నమయ్య అందుకున్నాడు: అందుకొనంగనే,- కనులు అరమోడ్పులైనవి: మనసు, వేయిందాల మెరిసే వెన్నెల:

వెన్నెల మడుగు కట్టినది:
మడుగులో తామర రవతళుకుతేరినది:
ఆ వెలుగులో,- తానో నిలువునీడ....

కనులలో సూర్యబింబము- మనసు తన కనులకందని చంద్రబింబము:

వన్నె వన్నెల మారుతము, అలలుకట్టి,- కానరాని సోపాన పాళికాగా,- తాను సరినడకల గమగమగా,- పదపదనీదని, ఏనాదమో హెచ్చరికలు సేయంగా,- ఎగసి ఎగసి,- ఎదురైన మదవతులు,- చేయూతల సాయం కాగా, ఐదుగురు పైదలుల సరస నెగసి,- పికరవ భృంగరవములు ఏకీకృతములై ఆత్మరవముకాగా,- ఆరవళిని,- కొండశిఖరి గమకముగా,- తన చేరువకాగా,- నాదమోదమే నీలమేఘమై,- పరవశమే, ప్రభంజనమై,- గురి కుదిరి,- గురుతు తెలిసి, జయ్ గోవిందా - అని ఎలుగెత్తి....జయ జయ ధ్వనుల కనులు తెరచి,- వాడే,-వాడే:- వాడే నావాడు!- అని నవ్వుకోగా,-

కృష్ణగురుడు,-ఔనురా:- వాడికనీవాడే! ఏడుకొండలమీద ఎదురు చూసేవాడు!

నీలి నిగ నిగవాడు, నిండైనవాడు!- తన వారి మ్రొక్కులకె తనివి చెందేవాడు!- తన్న కన్న ఘనుడు లేడనిపించువాడు! అల

కావరివాడు అల్లరివాడు: ఐశ్వర్యముల వాడు అరి పేదవాడు!

వాడు.. నీవాడే!

నాయనా.. వాడు దేవుడే. కాని ఎత్తు వారి చేతిబిడ్డ: కంటపడంగనే చాల పాపను చేసి చంకనేసుకొని ఆడించక పోతివో వాడు. నిన్నాడించేసురా: వెనుకటికి అన్నలమ్మ అని.. అరిపేద.. తల్లిగర్భములో కాలుసేతులు విడిచిపెట్టి.. వెనుకటిజన్మల్లో నోటిమాట భద్రపరచి.. మొండిగా. మూగగా పుట్టింది:

ఆబిడ్డ తలిదండ్రులకే వెక్కసమైంది: ఏడుకొండలవాని సన్నిధిలో వదిలిపెట్టి పోయినాడు: ఎవరుపెంచారు? వాడా! ఉహూ. ఆ అవ్వ జేసుకున్న పుణ్యం ఏ జన్మలోనో నోచిన నోము:

వాడు పెంచలేదు: తానే వాడిని ఆడించింది: ఆ పాపకంటిముందు వాడో చాల పాపడైనాడు: ఆ మూగతనమే వాడిని ముద్దుచేసింది.. ఆమనసు ఊగూగై జో కొట్టింది:

కాళ్ళేతులు లేని పుట్టువు వానికి పారాడ నేర్పింది: అలా పసితనాలు పోయి.. తాను అన్నలమ్మలో కలిసిపోయినాడు: అదొక కథ!.

కృష్ణమాచార్యుడని.. కాకతి గణపతి సేవలందినవాడు! ఆ కృష్ణుడు.. తంబుర చిరతలు పట్టి ఆడి పాడి అలసినవేళ.. ప్రభువే పదములొత్తే వాడట - అంతగా సపర్యలు చేసినా.. ఆ సిరి సంపదల నడుమ నుండలేక.. తరలిపోయి.. ఘనవాని సన్నిధి కేరి.. స్వామి.. నీవు సిరి కలవాడవు! కాని.. వీనికోసము సిరులకు దూరముగా!.. నీవు నీపై నిలచి నా సేవ లందుకో. అని మ్రొక్కుకోగా. కృష్ణమాచార్యుని సంకీర్తనము విన వేడుకపడి.. వారు కోరిన వర మనుగ్రహించినాడట! అన్నలమ్మ. దాలుని జేసినది—

కృష్ణమాచార్యుడు - విరాగిని చేసినాడు!

ఇక నీచేత బడినాడు. వాని నేమిచేసేవో! జయ్ గోవింద!.

వాడు.. లయకాడురా!. పాటలన్న వానికి పరమ ప్రీతి.. నీచేత పాడింపక మానడు: ఔనురా.. కోతి మూక వాని కొలువు కూటము! కోతి చేష్టలు వానికి చేతనౌను! చిత్తము వచ్చినట్లు నిన్నాడించ కలడు! అది గురుతుంచుకో! అన్నిటా మేలౌను! జయ రమా రమణ!.

కృష్ణగురుడు, మరి పలుకలేదు: అన్నమయ్యవంక చూడలేదు! లేచి నిలుచుని.. యిటు నడచి, కేశవస్వామికి మ్రొక్కి.. తన దారిని తాను పోయినాడు:

అప్పటికిఅన్నమయ్యకు-తెలిసివచ్చింది. ఉవ్వెత్తున లేచినాడు: అది గమనించి నరసింహరాయలు సమీపించినాడు:

అన్నమయ్య ప్రసన్నంగా.. రాయలూ. నీవలన గురుని దర్శనమైనది! గురువుల కటాక్షమున, నా దైవము కనులకు కట్టినాడు: నాలేమి తీరినది: యీనిరుపేదకు పవ నిధులబ్బినవి: నా మనసు నీ సుకృతమునకు కేల్మోడ్చుచున్నది: నా సేవా ఫలమిక.. సాళ్వవంశమునకు ధారాదత్తము! నీతీరున నీవు సుఖముగా, వాని తలచుకొని, వాని మేలు నమ్ముకొని.. ప్రజాపాలనము చేయగలవు!'





రాయలు అన్నమయ్యకు నమస్కరించి పోగా. వారించి.. రాయలూ.. యీ పేద బ్రాహ్మణుడు నిన్నొకటి యాచించేను: కాదనరాదు: నారాయణుని మ్రొక్కిన చేతుల నరునికి మ్రొక్కరాదు: మనుజుడు ఎంతటిఘనుడైననూ మాధవుడు కాడు: గురుతుంచుకో! ఎదుటివారి పెద్దరికము మన్నించేవా.. వారి సన్నిధిని.. శిరసు వంచిన చాలును: కైమోడ్పునీయరాదు:....

రాయలు శిరసువంచినాడు: అన్నమయ్య పకపక నవ్వి.. నరసింహుని కౌగలించుకుని.. వీడు ఘనుడుకాడు.. వానిదాసుడు! నీవనుమతించిన నేను సాగిపోయేనయా -!

పాలకీ పరివారమూ అక్కరలేదులే - వాడనుగ్రహించిన గానమే పాలకీ - కాళ్ళేతులే పరివారము!

వాని వాడనను కొనుటే వైభవము - జయ్ - గోవింద!.

రాయలకంట నీరు తిరిగినది! ఆవీరుడు దుఃఖమాపుకొనలేక పోయినాడు! పరుగున పోయి కేశవుని సన్నిధిని కూలబడి.. పసివానివలె రోదనముచేసినాడు! రాయలు-!

అన్నమయ్య వెంగటనున్నాడు! రాయలు వంచిన తలఎత్తలేక బిడియ పడినాడు!

రాయలూ, కన్నీట వాని పదములు కడిగినావు! చాలు! ఒకటి రెండు చిరునవ్వులు నావెంట పంపవయ్యా - వానిసన్నిధికి జేరుకొనేను!

రాయలు ప్రసన్నవదనుడుకాగా.. అన్నమయ్య పదచలనం జేసినాడు!

—కొండలపెట్టువ గోవింద - గోవింద కోలాహలము! అన్నమయ్య.. 'ఎన్నడూ లేనిదీ అలసట ఏమా?- అడుగుల తడబాటేమా?- ఆకలి దప్పికలేమా?-' అనుకుని వింతబోయినాడు! ఎదుట సోపానపాళి:- కాని తాను కదలేస్థితిలో లేడు!- అన్నలమ్మను గురుతుకు తెచ్చుకుని.. పారాడుతూ, పది దారలు ఎగువకెక్కినాడు! అలసట తనవెంటనే ఉన్నది! విదిలించుకున్నాడు: వదలలేదు! నిదురగా కౌగలించుకున్నది.

ఎవరో పండుతల్లి - దారినపోతూ తన్ను చూసింది! దగ్గిరకు వచ్చి కూచుంది! 'నాయనా!' అని వెన్ను నిమిరింది! తన అలసట మాయమై.. సత్తువ వచ్చింది! లేచి కూర్చున్నాడు!

అమ్మా!- ఎవరమ్మా మీరు!-

'ఏం కావాలమ్మా!- అన్నాడు: ఆ మాట కా తల్లి నవ్వింది! నీకేం కావలెనో చెప్పక.. నాకేం కావాలని అడుగుతున్నావా. చిన్నవాడా!- నిదురవదలినదా?-'

'నీచేతి చలువను -!'

'ఆకలీ దప్పికా -'

'మాతల్లి చలువను-'

'మీతల్లి అంత చల్లనిదా?-'

'ఎంత చల్లనిదో.. ఆమెకే తెలియాలి!'

'ఆమె పేరు?-'

'అమ్మను, అమ్మా!- అనడమేకాని.. మరేపేరున పిలుస్తాడమ్మా - ఆమే కన్నవాడు!'

'ఆమె యిప్పుడు ఎక్కడ -?'

'నా కనుల ఎదుట. బిడ్డను విడిచి తల్లి ఉంటుందా - ఎప్పుడైనా ఉండగలదా అమ్మా!-'

ఆ తల్లి నవ్వింది—

'నీమాటలు విన వేడుక! మాయింటి పట్టున యీ ప్రొద్దుండి,- ప్రాశన చేదువు గాని, రా-:'

'అంతకన్ననా!- కోనేటిరాయనిదర్శనం చేసి,- తప్పనిసరిగా, వచ్చేనమ్మా!-అమ్మా మీరూ స్వామి దర్శనానికే తరలి పోతున్నారా!'

'ఎక్కడికీ పోవడం లేదు;

చేకొన్న స్వామిని తనివిగా సేవించుకుంటే చాలును!

నాయనా- యిదో చూడు,- నా కంటి ముందు పండిన పండు: చేతికి అందినది. చెంగున కట్టుకున్నాను: ఆరగించు!-'

'కనుల కద్దు కుంటానమ్మా!—'

'ఇంతేనా,-?'

'ఈ సుకృతము చాలదా- అమ్మా-!

అమ్మా!- వారి దర్శనమునకు పోవలె- అనుమతించరమ్మా!-'

'మరల ఎప్పుడు నిన్ను కనులజూచేనో-'

'నిన్ను వెదకి కొనుచూరానా!-'

అన్నమయ్య కనులు తెరచినాడు:

ఎదుట ఆతల్లిలేదు- చేత మామిడిపండున్నది- కనులకు మరియొకసారి అద్దుకున్నాడు, తనలో తాను నవ్వుకున్నాడు- 'అమ్మా- ఎంత దయ! నిన్ను చేకొన్న స్వామితో, విన్నవించేనమ్మా-!' అనుకొని లేడివలె సాగినాడు:

అన్నమయ్య ఆలా చెంగలించుకుంటూ పోతూండగా,- కొమ్మలమీద, గుట్టలమీదా ఉన్న కోతులు,- ముందు వింతగా చూసినవి! ఒకకోతి పండ్లికిలించినది! మరొకటి తోక ఆడించినది. వేరొకటి వాని నడక నడచినది! కోతి పిల్లలు కిచకిచమంటూ వెంటాడినవి. ఒకకోతి పండు ఒడుసుకునేందుకు మీది కెగిరినది. అన్నమయ్య,- ఆ మూకకు మ్రొక్కి,- 'స్వామివారికి నివేదించి,- ప్రసాదం స్వీకరించండి!-' ఆ ఫలము అక్కడ ఉంచినాడు! ఒకకోతి అందుకుని,- నెత్తిన పెట్టుకుని, అన్నమయ్య వంకజూచి కిచకిచలాడి - కొమ్మ కెగిరినది! కోతిమూక,- ఓ గుట్టమలుపుకు మాయమైనది—

అన్నమయ్య ఎక్కిపోతున్నాడు!

జైనులు గుంపుగా ఎదురైనారు:

అన్నమయ్య, ఆగి,- వారికి మ్రొక్కినాడు! వారిలో ఒక వృద్ధుడు, చేరవచ్చి,-

'తెలిసి మ్రొక్కినావా!- తెలియక మ్రొక్కినావా?-'

'తెలిసీ తెలియక- మ్రొక్కించుకొను అర్హతమీకు లేదా- పోనిండు!-

ఈ తావు వానిది- ఎటు మ్రొక్కినా, ఏ వంక మ్రొక్కినా చెందునది వానికే-'

'ఎవరు నేర్పిన దీవిద్దె-?'

'విద్దెలు తానైనవాడే-!'

'ఆ నామధారియేనా?-'

'అది,- నామమో,- మన నేమానికైన, వాని వీమమో,- ఆవైనం నాకు వాడు చెప్ప లేదు! మీకు తెలిసిన నెలవీయండి:-'

'నెలవిచ్చేము! వాడోకల్ల- ఆడనికికల్ల- నీపలుకు కల్ల- ఏమనేవు?'

'ఏమనేను?-పలికినది వాడే అనేను:



జయ్- గోవిందా! నా కనుల నున్నది నీ రూపు నేను విన్నది నీపలుకు!- అడుగడుగునా నన్ను ఆడించదలచినావా?- ఆడుటకు వీడు సిద్ధమే!-....'

ఆ వృద్ధాచార్యుడు,- అన్నమయ్యను సందిట చేర్చుకుని,- చేతచెక్కిలిపట్టి,- వత్సా! పో- ఎగువకు పో- మనవాని జేరుకో-

ఆ గుంపుముందుకు సాగిపోయినది—

అన్నమయ్య - అటు పోవువానికి,- మరోసారి మ్రొక్కి,- 'కోనేరప్పా!- మా అన్నలను నా కెదురుపంపినావా!-' అనుకుంటూ ఆనందిస్తూ మరో పది అడుగులెక్కినాడు, గోవింద - గోవిందగా—

—'ఓరీ,- నిలువరా-' అని ఉరిమినాడు ఎదురైనవాడు! ముంజేతికి నాగకంకణము,- మెడలో మందారమాల! ముంతకొప్పు,- కొప్పున క్రొందగోగు,- కనుల దట్టముగా కజ్జలమూ, ఉరమున అరుణచందనము,- కట్టినది కోక,- ఉత్తరీయము పయ్యెద - అన్నమయ్య వాని,- నిలువు నిలువూ జూచినాడు,- చేయెత్తి మ్రొక్కినాడు!

'ఎక్కడికిరా?-'

'వాని సన్నిధికే—

'వాడెవడురా - అవివేకి - అక్కడ ఉన్నది అంబిరా - ఆదిలక్ష్మిరా !- కాద నేవా ?-'

'అయ్యా, నేను అజ్ఞానిని ! కాదనే విద్య నేరువలేదు ! మిమ్ములను అయ్యా అన వలెనో అమ్మా అనవలెనో, అవగతము కాలేదు !'

'అమ్మా అని ఎలుగెత్తరా- కొలువైఉన్న అంబను కొలుచుకోరా ! గిరిపై అనాదిగా వెలసిన ప్రత్యక్షదైవము పరాంబికరా— గురుతుంచుకో.-'

'గురుతించినాను !'

'అంబా అనరా !- అనవేమిరా !-'

—అంబా !- అని- దిశలు మార్మోగే ఎలుగు-

పలికినది ఒక గొంతు కాదు- పదిపదుల కెక్కువ - !

'ఆలకించినావుగా,- గోగణమునకున్న వివేకము గోవిందలుకొట్టి- పొర్లు దణ్ణములు పెట్టు- యీ నరజాతికిలేదు _! '

'నరజాతికే లేదా ?- యీగిరిని నమ్ము కున్న వానరజాతికీ లేదా ?-'

'లేదా?- ఓరి అపసద ! వారు వానరులా? వైశ్వానరులురా - యీ కొండ చిదగ్ని కుండమురా- అవి కిచకిచ కాదురా-శివశివ! పలికి భజించరా, నమ్మి తరించరా-'

'స్వామీ !- యీగిరిని చేరి తరించని వారెవరు ? నేను నరజాతివాడను : వానరుడ నయే యోగము నాకు లేదు: ఫాలమున కుంకుమరేఖ తీర్చినంతలో వాలముపెరిగేనా? కోక కట్టించినారే అనుకొందము : లేని కొమి రె(?)ప్రాయమబ్బేనా, గుబ్బెత నయేనా,- అయ్యా,- ఆడవేషము కట్టి,- ఆ పరమే శ్వరునంత వానిచేత హంహో(- అనిపిం చుట- ఒక్క- ఆదివిష్ణువునకే చెల్లినది: మనము కనుల కాటుక దిద్ది- వలెవాటుగా, పయ్యెద సవరించుకున్నా,- పరమశివునికి తనువేదుర కలిగేనా, మగవాడైపుట్టి,_ పాపము మనసేవలకై- మగువ తనాలకు బోయినాడే, అని మహేశ్వరి కరు ణించేనా- తెలియ కడిగేను కనులురుమ వద్దు-

ఎవరికేరూపున దోచినా,- ఎవరే తీరున భావన జేసినా,- కొండకొమ్మున ఉన్న దొక్కటే-! కనులు రెండు కాని,- చూపొక్కటే !- అంబా అన్ననూ గోవిందా అన్ననూ పలికెడి దొక్కటే!- గురుతుంచు కొనండి_'

'ఓరి భ్రష్టా !-'

'యీ భ్రష్టుడు,_వాని అనుగ్రహమున్న అదృష్టవంతుడు : మీదారి మీరైనా- నాదారి నాదైనా- చేరుకునే దొక్క- తావునకే- తాము,ఎటు నడచినా, మరల కలియక మానము : ఎక్కడ ? ఆకడ !- జయ గోవిందా !'

ఆడుపోడిమి వలెవాటుజేసికొన్న ఆ కొప్పువాడు, చురచురజూసి,- యీవంక, అవంక మెడత్రిప్పి హూంకరించి,- తన దారిని బోయినాడు !

అన్నమయ్య యింత ముందుకు సాగి నాడు ! వెనుకనుండి సమ్మర్దము ముంచుకు వచ్చినది. ఆ కోలాహలములో వానిగొంతు కలసిపోయినది ! జోడించిన చేతులు ఆ తీరుననే ఉన్నవి! అందరూ ఎటు మ్రొక్కిన తానటు మ్రొక్కి,- ఎటసాగిలపడిన అట సాగిలపడి,- ఎట మోకరిల్లిన అట మోక



రిలి,- కొంతతడవు నలుగురిలో కలసి నడచి,- క్రమముగా వెనుకబడి,- మరల తనకు తానై,- అడుగుతీసి అడుగువేస్తూ ఉండంగా,—

గోధూళి వేళ - ఏనెత్తమ్మునుండియో గరుడపక్షి - గురో - అన్నది: సంజెగాలి మెలమెల్లన బుసగొట్టినది ! ఎదుట మసక క్రమ్ముకుని, రోదసిని కారుపట్టి,- పైన కమ్మిన మొయిలు ఆదిశేషువంత విప్పారి,- పుంజె పుంజె పడగవిప్పి,- వేయి జిహ్వాలు తొణికినటుల,- వేయికివేయి కన్నులు మెణుకు మన్నటుల చుక్కల తళుకు! తన కనుల కాతళుకుకట్టినది: తన మెడనున్న తులసిమాలకు, వెన్నెల సోకినది.! జయ గోవిందా !-

ఎదుట ఆలమంద ! మందవెంటనుండి అలగాచే మందయానలు,- కిలకిలలు పోయే వారు,- ఒకరిమీదకు ఒకరొరిగే సర సాలవారు,- పలుకాడి చక్కిలిగింతలయే వారు,- పరవశాన నడచేవారు !- వారిచేత పాలదుత్తలులేవు ! ఆ దుత్తలు మోసికొని వచ్చేవి - కోతులు!-!

అన్నమయ్య, చూసి ఓహో(- అని నాడు - అయ్యా,- నన్ని సేవలకు నియో గించవయ్యా,- నాకీ పుణ్యము చాలునయ్యా!- అనుకొన్నాడు.!

[సశేషం]

ఇంపైన కథలు కావాలా
సొంపైన కార్టూన్లు కావాలా
సరికొత్త శీర్షికలు కావాలా
సరిగంచు వినోదం కావాలా

?

ఉగాది ఉదయాన వధూహృదయాన మధురోహలా
వెలువడుతుంది మిలమిలా
జ్యోతి ఉగాది సంచికలా

# వనవాలి

(గత సంచిక తరువాయి)

## ఆలయముచేరుపౌతూన్నది!

గోపురమునకు వెన్నెల కాపున్నది. గోపురాగ్ర హేమకలశములు ధగద్ధగల - కనుకళుకుల, చేరరమ్మని అనతులీయంగా..

సాగివచ్చే ఆలమంద ఒక్క అడుగు పాటు నిలచి, మోరఎత్తి-అంబా అనంగా,- దుత్తలు నెత్తినుంచుకున్న కోతులు.. ఆ దుత్తలు ఆ ధామలందు కొనంగా,.. సాగిల పడంగా.. తనకు వల్లమాలిన పరవశమై,.. సాగిలిపడి.. పొర్లుదండములు పెట్టి,- ఒక్కడే పరుగుగా పోయి, వాని సన్నిధి జేరి.. తనివార,.. పనవి పనవి మరి మరి తమకానబోయి,.. వానిరూపు, కుదురుగా కనుల నిలుపుకొని,.. వాని ప్రాపునకు హత్తు కొని..

అయ్యలూ కోనేటిరాయ !.. నీకు తోడు ..లో సన్నాసి గిరిపట్టినాడురా,.. అని ఎరుక పరచి,.. తనకన్నవారిపేరు జెప్పి, గురు రాయని పేరు జెప్పి,.. మ న సే పూ జ గ సేయంగా,-

అన్నమయ్యను,.. కనుల ఎదుటివాడు ఆడించ మొదలిడంగా,.వీనికాతీరున మరులు కమ్ముకొనంగా,—

లోకానికి దేవుడై వెలసినవాడు.. ఒంటి పాటువ లోకమేల దలచినవాడు,.. ఏ వే కనో, ఏ మమతనో, మనువు మనసై అప్పు జేసి,.. ముప్పునబడి, తనకు తా తెలియక ఆలికి దూరమైనవాడు - అరగింపులమీదనే ఆధారపడినవాడు - తనవంటి బికారులే పరివేష్టించినవాడు - కోతిమూకల నడుమ కొలువు దీరినవాడు ! అయ్యో వ్రాత,.. తనకో కర్పూర దీపంలేక.. అగరు ధూపం లేక చందన చర్చలేక, జవాదినామం లేక, పరిమళింపులేక, పవళింపులేక ఏవేళ కావేళ తులసితీర్థంతోతృప్తిపడుతూండటంతగునా, -

మల్లాది రామకృష్ణశాస్త్రి

తగవా. అనుకొని.. బిచ్చమడిగి మలయజం దెచ్చి.యాచించివచ్చికప్పురంతెచ్చి.కలవారి వేడుకొని కస్తూరిదెచ్చి.. కాశ్మీరందెచ్చిసమర్పించి మెప్పులుపలికి.అయ్యా కోనేటిరాయ- అవధరించరా! ఇవినీసేవలకైనవిరా! కైకొనరాకై సేయరా..ఘుమఘుమలాడరా..ఆలిని పల్లనివాడవైనా. అంతర్యములో గృహస్తువురా.. దేవరకీ దిని తనమేల- యిది మనకు మేలుకాదు! అని.. పరిపరి విధముల విన్నపాలు పలికి.. పలుకుల కొలిచి.. చందన చర్చలసేవించి,—— తనచేతల తామురిసి, ఏనాటికైన తన దైవానికి.. యీ విరాగి తనమువదలి.. రవంత వేడుకతనం అలవడే నేమోనని, గట్టు దిగేనేమోనని ఆసపడి.

ఆ ప్రభువింకా చలించకుండా.. పరిమళింపు మెండైనా.. పాషాణ పాకానే ఉంటున్నట్టు మనసున రూఢికాగా, యిహ.. యిది పనిగాదని.. కలలో తానోయింటివాడై.. అనువుకాని యిష్టకామ్యాలనుభవిస్తూ,

రాయడా.. దేవదేవుడవే- నీకు తోచక పోతే మానె,- నన్నుచూసి నేర్చుకోరా..- మా తీరుకు ముచ్చటపడరా! నరులలో ఉన్నందుకు, నాగరీకం ఉండాలిరా, నాచేత.. మరిమరి చెప్పించుకోకురా, అది: నీ గిరికీ, నినునమ్మిన వారికీ పరువుకాదురా, అని అన్నంతలో పుట్టెడుదుఃఖము వచ్చి.- నేనలా కలలుకంటున్నా. నీవు కరుగవైతివే! నాసేవలో లోపమా.. వీడు మనకు బుద్ధులు చెప్పవచ్చినాడుగా.. అని కోపమా? అప్పతూ!,

నీకెందుకీ కక్ష - నాకెందుకీ శిక్ష! - నిలువనీయకుండచేసి — నీ సన్నిధికి రప్పించుకున్నావు - ఈ నయవంచనకా?- యిక ఏ మొగముపెట్టుకొని నీ సేవలకు వచ్చేనురా? - నీ సేవలకు మాలితే, - మరి నాకు బ్రతుకేదిరా? — యిలా మొరలు బెట్టుకున్నా, - చలించకపోయిరే! —

చలించక పోతిరనడం పొరపాటు:

అయ్యది, తనకు అంత వాత్సల్యగా వినికిడి కావాలా? — అలమందల నడరించక బెదరించక, కనుసైగలతో కాచే గొల్ల కన్నెలు, జుంటి తేనెలూ, పచ్చి కస్తురీ అప్పనగా తెచ్చే కొండ సానులు, ఆకాశమంత జారు కొప్పేసుకుని, అదరు నడకను పెదరు బియ్యం, వెన్నా దెచ్చే చెంచితలు.మూకమల్లెగా, వచ్చిపడి అన్నా.- యిదేమి చోద్దెమన్నా అని, కేరడములు కులికి, అయ్య చెలరేగి పోయినాడు, కనుమూయ నివ్వడు, - కనుచాటు కానియ్యడు: మంచికిరాడు, - మనవులిచ్చుకున్నా వినడు: పట్టిన చెంగు పట్టకుండా, — నొక్కిన చెక్కిలి నొక్కకుండా, - అందీ అందని తేరగాడై తెగబడినాడు: నీవు వచ్చి, ఆసామికి బుద్ధులూ విద్దెలూ నేర్పినావా? - నీకున్న భ్రమతలు అయ్యమీదికి తోసి ఆడించు తున్నావా! - పల్లకున్నట్టే ఉండి పలుగాకి తనానికి బోతవా? - ఓరబ్బ, నీ వీసాటి మనిషివా, - ఆయనీపాటి దేవుడా?-, అని నవ్వులలో బెట్టి, - స్వామి వారిని సంతను బెట్టంగా, —

ఆపొట్టివాడు..మరింత కుదించుకుపోయి,

మందార వనంలో, - నిత్యవైభవాన, నిబిడ మందహాసాన, - నిరంతర



ప్రసన్నమూర్తిగా, - కొలువు తీరిన అమ్మవారి సన్నిధికి, పడుతూ లేస్తూ పోయినాడు:

పలుకు తేనెల తల్లీ .... యిలాజరిగినదమ్మాఅని, - చెప్పలేక చెప్పలేక ఏకరువు బెట్టినాడు:

చందనచర్చ చేయించింది - స్వామివారికు దయచేసేరని కాని, - యిలా చెలరేగు తారని కాదమ్మా!-

కస్తురినామం దీర్చింది - కాముకు జోచేసేందుకు కాదమ్మా! మీ దాంపత్యలీల, లోక కళ్యాణమున కయ్యేనని, - మీ మక్కువల గొని యాదే ఫలం నాకు దక్కేనని ఆసపడినానమ్మా!—

స్వామివారు గట్టుమీద గడిదేరినారు! నా చేతకు మీరిపోయినారు: యిక నీవు కలుగజేసి కొనవలె తల్లి—

ఏ నాడలిగినారో,- ఎందుల కలిగినారో,- యీ అలుక లెంతకాలము సాగేనో, - వీనికి తెలియదు: మీరుచెప్పరు!- పోనీ తల్లి,

మీరీ తరుణాన కదలిరావాలి
వారిని కన్నారా, మందలించాలి:
కాని నాడు,

ఆ తండ్రికి ఆ పదవీ ప్రాభవమూ ఉండదు ;

యీ బిడ్డకు, - వానివాడన్న పరువూ ఉండదు :—'

—ఆ తల్లి కదలలేదు: వినిపించు కొని నట్లే లేదు:

అక్కడ కూలబడినాడు :

అమ్మా, - కలవారి బిడ్డవు, కలుములతల్లివి- అఖిల భువనాలు నీ మందహాసాలు :

మాతల్లీ నీ చిరునవ్వులే.- స్వామిసన్నిధికి, సోపానపాళి: నీ మమతలే, - స్వామికి నిత్య ధూపదీపములు: నీ అనురాగమే, వారికి అలంకరణము! నీ వాలుజూపులే, - వారికి అనుదిన మంగళ స్నానములు: నీ మక్కువే వారికి పరిధానము :- నీకైన శృంగారులమ్మావారు !- యీ తీరైనారు! - మారు పలుకవేమమ్మా ! -

అమ్మా ! - నీ ఒంటరి తనం జూస్తూ,- నీ సన్నిధిలో నిలువలేను: అయ్యచేసిన సేతకు, - చిత్తమొగ్గి ఉండలేను: నా మొగ మక్కడ చూపలేను:

అయ్య ఆతీరు! - అమ్మ యీ తీరు!-

యీ బిడ్డనేమి చేసేరమ్మా ! - నే నేమై పోవలెనమ్మా ! - '

ఆ తల్లి, - తనగోడు ఆలించదాయె-బదులు పలుకదాయె ! -

'కొండనున్న గోగుపూవు, కొండదిగిరాదు: కొలనులో కెందమ్మి - తాచేరబోదు :

ఒక్కరికి విన నేర్పలేదు: కానీ తల్లీ: మీకు మీరెంత దూరమో ఎల్లకాలమూ, - వీనికీ, మీరంత దూరమే ! -

అన్నమయ్య దుసరుసలాడినాడు: వెను దిరగబోయి, - ఆగి, - ఆ తల్లివంక జూచి- తలవంచుకుని, - అడుగులు వెనుకకువైచి, - ఒక్కక్షణం మోకరిలి, - ఒక పరి చేతులు జోడించి, - ఆ చేతులు కనుల కద్దుకొని, - ఆ తావు గడచి నడచిపోగా, -

తనవెంట చీకటులు తరుముకురాగా, -

అరబయలున - అరబోసిన మసక -

మసక - సుంకేసుల ప్రాసై-

ప్రాసునీడ - వెలుగంత చిన్నది -

నిలుచుండగా,

ఎదో కరముసోకి ఆ జవ్వని కెవ్వు మనంగా, - ఎదో మోము, ఆ మోమునలమి కొనగా, - తన మనసు కెవ్వుమని,-ఆలేమ నాదుకొన, - ముందురుకబోయి, - కాళ్ళే తులు కదలక, - ఆ గండుతనమును తానరి కట్టలేక, కనులుమూయ తరము గాక, - తనజన్మ కెవ్వుమనంగా,

తాను కెవ్వుమనెనో, - తనివార నవ్వు కొనెనో, ,

తెలియని ఆనందమై, - ఆనీడ చూపిచ్చి- ఆ వెలుగు తెలివి నీయంగా, —

తాను తేరిపార జూడంగా, - కెవ్వుమన్న జవ్వని ఎవ్వరు!కొలనులో తామర! కేరడము లాడినదెవ్వరు - కొండ కొమ్మన గోగు పూవు ! -

అయ్య కొంగొడిసి పట్టిన గొల్ల చేడియ,

చెక్కిలి నొక్కిన చెంచిత, -

చిలిపి సేతల కరగిన కొండసాని, -

ఎవ్వరువారు - ఆ తామర రేకలే -

ఆ కెందమ్మి తళుకులే ! —

అహో!- అన్నది రోదసి; ఆ లీల; తన మనసును లాలించగా, - అన్నమయ్య, - ఆ తావుకు మ్రొక్కి- తనవారికి మ్రొక్కి,- ఆ లీల లాలపించంగా, శ్రీ! అన్నవాడాయె!-





—అన్నవాడాయె: అమ్మనూ అయ్యనూ - పదాల మాలలల్లి కొలిచేనని, అనుకొన్న వాడాయె ;

కాని, - వీని నిలయమూ, వైభవమూ శాశ్వతముకానూ ! కనుల గట్టకముందు గాన మిచ్చిన వాడు; కరుణించి ఆనాడు: కనుల వెలిగినవాడు, - తన సన్నిధినె నిలుపుకొన్న మన్ననవాడు: దైవరాయా అన్న తానహో అనువాడు - తనవాడు.

తనచే పలికించడేమొ, -

గానమాగిపోయె. మాట నోటనే నిలిచి పోయె ! - 'పలికించరా - అప్పా !- పలుకు లీయరా -' అని, నయాన, నీపై పాటలు పాడేనుర ! - నిన్ను కొనియాడేనుర! - అని నయాన, - నీ మేన నలమిన పచ్చకప్పురపు తావి ! . నా పలుకుల శాశ్వతముగ నిలి చేనురా, - నీవు తిలకమిడిన కస్తూరి, - నా పాటలు, కలకాలము పరిమళించేనురా ! - నా సంకీర్తనలే, - నీ ఘుమఘుమలు,- నా సేవా క్రమమె నీ అనంతకీర్తి, - కోనేటిరాయ, - నేను కోరిన దీవరమే - కాదనరాదురా, - '

అని నవకాన, 'అనుదినము నిను కనుగొన వలెనని, - గిరికి సిరులొసగు వరదుడవని,- కరుణయె తన బిరుదని, - దరిసిన నరులకు తన చిరునగవులె వరమని - తలచి కొలిచిన ఫలమిదియ -' అని, అతి లఘువు గానూ - మనవులిచ్చుకున్నా, - అప్పుడు కిమ్మనపోగా, - అన్నమయ్య, వేరు దిక్కు తోచక, - గురువులను తలచుకుని, -

స్వామీ - అన్నలమ చేసిన సుకృతము నేను సేయలేదా ? - కృష్ణమాచార్యుని పుణ్యము నాకు లభించదా ? - ఆచార్యుని తంబుర చిరతలు నాకు కటాక్షించలేరా. - కొండలరాయడు నాకు వాక్కియ్యక పోయిన మానె..నా మౌనమే వాడాలించేను : తంబుర నాదమే. - గానమై ముఖరించేను : చిరుతలే పలుకులై మ్రోగేను : అందులకూ వీడు నోచకపోయెనా. - పోనిండు - నా తనువే తంబుర. - నా మనసే చిరుతల జోడు - యీ జన్మ. సంకీర్తన :!' - అని పలికి. - కోనేటి రాయని కనుల ముందుంచుకుని. - సొక్కిపోంగా. -

—సరసను. కిలకిలలు దోచె :

అదేమా. - అనుకొనంగా. - ఎవ్వతో..ఒక చేడియ..తన చిందులకు వింతబోయి..నవ్వుల పలుకరించినదని తెలుసుకుని. తానామెకు మ్రొక్కంగా. - అదాల యినుమిక్కిలిగా నవ్వులబోయి -

'అన్నమయ్యా ! - ఒంటరిగా చిందేస్తే అప్పడు ఒల్లడు; మొక్కేందుకు రెండు చేతులుండద్దా : ముచ్చట పడేందుకు జంట మనసులుండద్దా ? -

నీకైన కన్నె ఏ నీడనున్నదో - వెదకి తెచ్చుకో - అయ్యకు వేడుక లిచ్చుకో !-'

అన్నమయ్య. - వినయంగా. -

'వెదుకబోలేను: వెనుకకూ పోలేను:

కొండకు రప్పించాడు: కొలువిచ్చాడు; చనువిచ్చాడు: కనులనీడనుండ నిచ్చాడు: కాని. - ముత్యమిచ్చి. - రత్నము పుచ్చకు న్నా డు: నా పలుకు నా కీయడో. - యీ నా పాట విన వేడుక పడడో. ఒంటరి చిందులే నా చేతనైనవి; యీ చిందులకు సాయం చెలియ ఎందుకు ?''



'నీవుపలికేందుకు! - నిన్ను పలికేందుకు!- చెంత చెలియలేదో. - జిహ్వాను సరస్వతి లేదు.

అన్నమయ్య అయినా అంతే. - ఆదివిష్ణువైనా అంతే!- బుద్ధులు తెలిసిన చిన్నవాడా. - నీ పుణ్యం. ఊ ర కె పో దు. నీ పలుకులు నిన్ను చేరక మానవు ! నీ కైనీ వారు నిన్ను చెందక మానరు: నీ చిందులు ఎల్లకాలమూ సాగవులే - అప్పడుసాగనీయడులే!-కొమ్మకొమ్మకో గోవిందగాచెంగిలించే తిమ్మడికి. కుటుంబముంది; కొండలరాయడికి కోలో.. కోలో అని.- నిండుతనాన దద్దరిలే బసవడికి కదుపుంది - కామాటముంది !

చిలకకు చిలకుంది ! గువ్వకు గువ్వుంది;

మానికి తీవె ఉంది; మనసుకు మనసుంది.

ఉండితీరాలి ! అది-, నిదర్శనం !-

మన. శ్రీవారు.- సింగారి !- కనుచూపు మేరలో ఒంటరితనం సనేమిరా.- వారు సహించరు !- అది వారిసత్యం . యికనన్న తెలుసుకో !

కొండదిగి. కొమ్మను తెచ్చుకో!-'

'దిగను !'

'వగలబోకు !- వారేదించుతారు ! వలసినట్లు వంచుతారు !-

కొంగుముళ్ళతో.- సరిమ్రొక్కులందుకుని.- మరల రప్పించుకుంటారు !-

ఆ చిలుకరేకను.- నీవు కోరిన తీరున పలుకబ్బేనేమో !-

ఔను చిన్నవాడా !- మగవానిజాతకం - మగనాలి సుకృతం -



ఓతు ఓరే గురుతుకు తెచ్చుకో :-

కొంచెంతదేవుడు.- ఒంటరిగ ఉండనేల అని అరాటపడినా వారళ్ళు చేసినావు !- మందికి మదనపడి.- క్రిందికి దించినావు!-

సుంకేశుల మానిక్రింది చోద్దెం చూసినావు !-

అంతలు జేసినావే-ఆ అయ్యమరచేనా ?

నిన్ను ఒంటిపాటుకు వదిలేనా ?-

చిత్తము అర్పించినప్పడే. సిగ. వారికి అందించినావు : వారి చిత్తమురా.- చిందు వేయించక మానేరా ?-'

అన్నమయ్య.- అతల్లివంక జూసి. పకపకనవ్వి.

'అమ్మా !- నీమాటకు అడ్డం వస్తున్నాను ! వట్టినకు నీధోరణిలో - నీవన్నది నిజమే అయినా.-

నాధోరణే నాది; చిత్తగించావా అమ్మా !- పిని సిగ.వారికి చిక్కిందనుకోకు!- వారే.. మనచేతుల్లో చెప్పచేతల్లో ఉన్నారు !-

ఉంటారు ; వారికి మరోదారిలేదు !

మనసు చిగిరించేవేళ.-మరులెత్తించారు: ...సుఖానికి రప్పించుకుంటున్నామురా. అ... మెరమెచ్చులు పోయినారు ! అంత కన్నరా.. అనుకున్నాను : వచ్చాను ; అమ్మదో.- రావలసివచ్చాననుకునేవు. కావలనే యీగట్టు ఎక్కాను ! చిక్కాడుగదరా. వీడు :- అనుకున్నాడు.- ఆ నిలువుజీతం వాడు ; ఆదే సంబరాన ఉన్నాడు !

అమ్మా!- ఆ. మేని నిగనిగవాడు మెండు ...ముం వాడు - ఎంతటి అమాయకుడూ కాకపోతే. - నాకోసం ఎందుకింత తాపత్రయం ! - లోకంలో. - అందరూ పెళ్ళిళ్ళ చేసుకుంటున్నారా? తాను చేయిస్తున్నాడా-



తనవాడను కొన్నవాడు. - ఒంటిపాటున ఉండిపోవడం తన ఘనతకు తగదనుకొన్నాడు కాబోలు: యీ ఎత్తుకు దిగినాడు: అంతవరకూ మాటాగాయె !'

కాని. – అమ్మా. - నీ వేమనుకున్నా సరేగాని.-

అవ్వారిది - పరమ పాషాణసరసం! -

చెప్పేతీరు వారికి తెలియదు :

తెలియకనే - గొంతు పట్టుకున్నారు ! తమ చిత్తము వచ్చినట్లు. - వీడిని మలచవచ్చునని : -

నన్ను పలుకాడ నీయడో - ఎవరికి లోపం ?-

అమ్మా ! - చతుర్దశ భువనములూ. - తనకు క్రీడారంగమై యుండగా. - కావలెనని. - తెలుగులకు దైవమై. - వలసి. - తెలుగు సీమనే. తాను నెలకొన్న దెందులకు ? - అన్నమయ్య సంకీర్తన మాలించేందుకు ? -

ఔనా. కాదా ?-

తనకు లొంగనని. - యిప్పటికి తెలిసివచ్చింది

కాబోలు. - అమ్మను పురికొల్పినాడు. వట్టిపుణ్యానికే !

మా అమ్మా నన్ను కాదనదు: నన్ను వెనుక వేసుకుని వస్తుంది.

అని. ఆ వేదవంద్యునికి తెలియదు !-

నిజమిది కాదా. అమ్మా........'

ఆ తల్లి నవ్వినది: ........

ఆ నవ్వు - నవ్వులై, - ఆ నవ్వులు లేలేత గొజ్జంగిరేకలై. - ఆరేకలు.- కెంపులై వాని అరుణిమ, తళుకు - మంచుగా. - చినికి - చినికి, - జడిగట్టి. - వర్షాని జంఝూ విజృంభించి, పలురంగులమబ్బులు గీపెట్టి.- సుడిదిరిగి,- ముద్దకట్టి. - ఆ ముద్ద ముత్తైదువై. - కనుల ఆనంద నీలాలు చిలుకంగా ఆ జిలుగులు, - చివురించంగా - గుములు గుములుగా, మెరుపుతీవెలుసాగి. - సాగిన తీవె ఒక మేనక, మెరసిన మెరుపు ఒక ఊర్వశి. — కాగా, - రోదసి, ఎల్లలు మీరిన నందనమై. - రవళించంగా ?-

తనకన్నులు వేయికన్నులై, - వేయి కన్నుల వేవేల చూపులై, - ఆ చిత్తరితనాల కోరాడంగా, - అచ్చరముగుదల కులుకుల రూపొందినచిలుక హుమాయిదొరకుచక్కలిగింతలుకాంగా.- పచ్చని, నులివెచ్చని ఐద మ్ములు.మరిమరి దోదమ్ములు చెలరేగి గరిషాడవగా.-ఆసమ్మదాన,- అమ్మదవతులు,-రమకన్నవాని తత్తడులవలె.రివ్వునకమ్ముకొని,- చిడిముడి సేతల, కంటి - మెప్పుల కల్లోలము సేయంగా,- తనకు మాలిన ధర్మమిది తగవుమీరిన సరసమిది.- అనిమననముగా.- ఎయ్యది విధివదాచరణీయమో, ఏది నిషిద్ధమో.- తెలియని తనాన.- తెలిసీ తెలియని తమకాన.- తెలుసుకునే కుతుకాన.- నివ్వెరిమొనవాని.- జిజ్ఞాసలో అటు మొగ్గిన పుణ్యాన, —

ఒక కౌగిట కరగి,- వేరొక మక్కువ మరగి,

ఒక కెమ్మోవిని సోకి.- మరియొక కన్గవకుదకి.- అలవిమాలిన తీయందనాలు వాగురులై అలముకొనంగా,- నిబ్బరము సామరి.- ఒక్కక్షణ మేమరి.- మినుకు - మినుకుమనే యింగితము, కెరలి అమ్మా !- అమ్మా ! అని,- తన మూగతనమే వాపోవంగా.-

ఆ హావభావముల్ కొన్నోయిగా.- ఆ సేతలె నిటలముగా.- ఆ ఆనందమె ఆననముగా.- ఆ అరుణిమయే.- రూపముగా.- రోదసి చిన్ముద్రగా.- తాను.- ఆపాదసన్నిధిని కరవీర కోరకముగా, తోచంగా.-

తానో చిరునగవై.-

ఆ చిరునగవే.- కనులనిండిన అంబకు ఉపాయనమై.- ఆతల్లి ప్రసన్నురాలుకాగా,-

ఆ కనుల వెలుగులో.- ఆతల్లి నీడలో.- ఆదరహాసనుషమలో,-

అయిదుపాయల జడలతో, వయ్యారి నడకలతో, కాళ్ళపారాణితో, కనుల కాటుకతో, మోముల కళ్యాణ రేఖలతో.- కదలి వచ్చే.- తనకెదురువచ్చే.- తనవారిని, గురుతించి.-అమ్మా!యిదే నీ అభిమతమా.- కానీ తల్లీ.- వారిమాట కాదన్నందు కొకటీ.- నీతో రెట్టించినందుకొకటీ.- వెరసి రెండు వరాలు నాకు ప్రసాదించారా !- ఏవమ్మా మీ చిలిపితనం !- యిరువురితో వీడెలా సతమతమయేనో చూడమని.- మీ ఉబలాటమా !-

అమ్మా !- బొమ్మల పెళ్ళిచేయడం- ఆ ఆటలేగి - తనానికి ముచ్చట పడటం, పసితనపు బులబాటము కాదూ !

తీరా, ఆరా చూచావా ?- నన్నో యింటి వాడిని చేయబోయి - మీరు పసివారైనారు ; ఎల్లకాలం.- యిక, మాకళ్ళకు మీరంతే :-







శోకానికిద్దైవాలు - మాకు; మాపిల్లలు !,

అప్పుడు - మావంశోద్ధారకుడు - యీ వాల-తాళ్ళపాకవారి పెద్దకోడలు!-

చిత్తగించావుగద !- కల్పనలో.- నేసూ మీకు తగిన ఘనుడ్డే ! కాబోయే కళ్యాణం కళ్ళలో మెరిపిస్తే - మూడుముళ్ళు పడకముందే, కొడుకునూ కోడల్ని యింటికి తెచ్చుకున్నాను !

అమ్మాయ్-గురుతుంచుకో.- మనయింట సందెదీపం పెట్టడం - నీవంతు !-'

అన్నమయ్య కనులకు తెలివివచ్చినది- చూపు తెరిపిచ్చినది !

తానన్నది గురుతుకు వచ్చినది -

ఉలికిపడినాడు - అమ్మా : అన్నాడు !

ఆతల్లి కనిపించలేదు !

అవ్వా ! - నన్నాడించినది నీవా !- అన్నాడు !

అవ్వ, ఔనన్నట్లనిపించినది :

బిడియపడి, తలవంచుకున్నాడు........

— మాడుపూరిలో ఆడపడుచు, వంచిన తల ఎత్తినది -

అన్నా ! మువ్వగోపాలా ! అని తనలో తానుగా పలుకరించినది. ఏదో చెప్పబోయినది ! అంతలో బిడియపడి, పలుకబోయిన- పలుకు మనసున దాచుకుని.- కదలే పెదవిని మునిపంట నదిమి,


కనుల కలకలలు ముత్యాల తళుకులు జిమ్మ

గొజ్జంగిచాయ చెక్కిలిగ్రమ్ముకొనగ,—
అలనాడు, కొలనుదరి తనవాని దరిజేర
అరమోడ్పు గనుల నేరనితనముజూచి,
చనవుగ పల్కరించగ మేలమాడ,
కొనియాడ-మేనత్తకొమరుని మొరసి,
మొలకనవ్వులు ఉపాయనమీయబోయి
తోరంపు నునుసిగ్గు దొంతరల్ తామై
కైదండలీయంగ, కలికితనమ్ము

"డాక్టరుగారూ, నేను మా అల్లుడి కాలు విరగ్గొట్టేసుగాని, కొంచెం నెట్టుకట్టండి" అని ఒక ...సామి ఇంకో గోసామిని తీ...చ్చాడు.

"అదేమిటయ్యా ఎవరైనా అల్లుడికాలు విరక్కొడతారా" అని డాక్టరుగారి ".'

"విరకొట్టిన నప్పుడు మా అల్లుడుకాడు" అని సంజాయిషీ.



యేలప్రాయమునకు చక్కిలిగింతలీయ

బావా :-అని దూరాన ఉన్నవానిని, అను దినమూ, పలుకరించినట్లే పలుకరించింది !

కాని,- యీనాడెందుకో,- అలవాటు కొలదీ :పలుకరించబోగా,- బిడియము వేసింది !

బిడియమంటే తనకు యింతకుముందు తెలియదు :

ఆ వింత-దనం,- ఆ తిన్నని-తీయని విన్నదనం బిడియమని-- అది,- కన్నె తనానికి చేర్పుచుక్క అనీ,- ఎవ్వరూ తెలియ జెప్పలేదు :

ఈనాడు వైశాఖపూర్ణిమ :

ఔను,- పూర్ణిమ :-

తిమ్మక్క,- మువ్వగోపాలుని వంక, మరోమారు చూసినది- పలుకబోయి మరింత సిగ్గుపడినది -

ఇటు తిరిగినది -

తల్లి !-

తల్లి కనులవంకజూసి,- అమ్మా! అని, పలుకబోయి,- అంతలో సిగ్గుపడినది: తల్లి,- చిన్నదాన్ని దగ్గరసా తీసుకుని, చెక్కిలి నిమిరి,- ఆ మోమువంకచూసి,- మురిపెంగా ఉహూం - అన్నది-

సరిగ్గా ఆ తరుణంలో మాధవయ్య ఆ చాయలకు రావడం,- కనులతో భార్యను ప్రశ్నించడం,- వైనంతెలుసుకున్నవాడై - ఉహూం - అనడం జరిగింది :

అమ్మా అన్నాడు - తండ్రి

పిల్లది - తలయెత్తి చూసింది -

అలాగేనమ్మా !- అన్నాడు -

తిమ్మక్క - బిడీయం పోయింది - మరింత కలకలలాడింది !-

పిల్లదాని సంబరంచూసి, - మాధవయ్య ధోరణి చూచి, యింటికైన యిల్లాలు కొంచెం బెరుకుగానే, - గొంతుసవరించు కుని, - ఆయన్ను యివతలికి పిలిచి, - తాననేమాటలు పిల్లలు వినకూడదనుకున్నదో ఏమో, - తులసి కోట దగ్గిరకు తీసుకు వెళ్ళి, అటూ యిటూ కలయజూసి, - నా మాట, - రవంత వింటారా ? అన్నది-

మాధవయ్య, - యిల్లాలివంక ప్రసన్నంగా చూసి, - మౌనహాసం చేసి, - 'వింటే మాబాగే, - నేనూ అందరు గృహస్థులతో పాటే - కాని, - అలావింటానా?-'

ఆవిడా, - నవ్వుతూనే - 'యీ పెడసరి తనమే యింటికి అదృష్టం - అందుకు సంబరపడుతూనే ఉన్నాను .... మీ ఎదుట పడి ఎవ్వరూ, - తగుదుమని పలుకలేరు : తగనిది కాదనలేరు : అది, - మా అత్తగారి కడుపుచలువ,-మా మామగారిపూజాఫలము. వటవృక్షం నీడనిచ్చి నేదదీర్చేను: ఆ ఆలనా పాలనా, ఆ ఆదరణా అంతవరకే; తన ఏ పిచ్చేనా, తనఘనత యిచ్చేనా? - మీయింట సంజె దీపంపెట్టి, - మీ పిల్లలకూ మీకూ ఊడిగం చేస్తే - నాయీ సుకృతానికి తాము తరించేమని, ననుకన్న వారు, - నన్ను మీ చేతికి అప్పగించినా - మీరెంత మన్నన చేసినా - మీ అంతదానిని నేను కాగలనా? - మీరింట లేని వేళజూసి, - ఆశెమ్మా ఓసెమ్మా, - కమ్ముకుని, - యిదేమి విడ్డూరమే మాతల్లీ, - అతగాడికి తోచక పోయినా, - నీకైనా రవంత యింగితం ఉండవద్దటే! అభం శుభం ఎరుగని



పిల్ల, - దాని ఉబలాటం కొద్దీ, - ఏదో సంబరపడిందే అనుకుందాం - పెద వాళ్ళంటూ ఉన్నది, కాదూ - కూడదూ అనేందుకేగా, - ఆదిమూసి, - ఛళా ఛళీ అంటారా? - శాస్త్రం ఒప్పుకుంటుందా? - శాస్త్రం, సంప్రదాయంమాట ఏలా ఉన్నా,- యింటికి పెద్దాదపడుచు, - ఓ అచ్చటా ముచ్చటా లేకుండా, - ఏమిటిది? ఆఖరికి కురకల కులాన అయినా, - ఆవో అనక ముందే జాహో అనరే - యింత దేశ ముండగా, - యీ వింత మన గ్రామంలోనే పుట్టాలా? - అని సన్నాయి నొక్కులు నొక్కితే—?'

'—నవ్వి ఊరుకో!- ఓసి పిచ్చిదానా-! వింతపుట్టినా విడ్డూర్యం పుట్టినా - మన యింటనే పుట్టాలి కాని, ఊరివారందరికీ అసుకృతమేదీ? - అనాడు, - మాలక్కమ పెళ్ళినాడు, - పెద్దరికమెవరిది ? - మా నాన్నది కాదు, మాధవస్వామిది! అమ్మాయి పెళ్ళికి పెద్దలెవ్వరు? మనమూ, - అక్కడ వెలసినవారా ?-

ఆసెమ్మనూ, ఓసెమ్మనూ, - తీరుబడిగా తల తడిమి చూసుకోమను .... యీ ధర్మ సూక్ష్మం చిటికెలో అవగత మౌతుంది.

నీకు తెలియక పోలేదుగాని, - జ్ఞాపకం చేయడం మంచిది: మన పెద్దల పున్నెమా అని, - ధర్మం మనయింట పుట్టింది, శాస్త్రం మనయిల్లు పట్టింది:

మనం వంకలు దిద్దేవారం!- ప్రేలు వంపించుకునేవారం కాము; యిది, దైవ నిర్ణయం ;

మరోవిషయం—



ఒక పెద్దమనిషి కాఫీ హోటలుకు వెళ్లి ఒక కప్పు కాఫీ తాగాడు. బిల్లు చెల్లిస్తూ ప్రొప్రయిటర్ని చూసి "రోజుకు మీరెన్ని కప్పుల కాఫీ అమ్ముతారు?" అని ప్రశ్నించాడు.

"వెయ్యి కప్పులు"

"రోజుకి రెండువేలు అమ్మే ఉపాయం చెప్పనా?" అని కష్టమరు అడిగాడు.

"చెప్పండి - చెప్పండి - చెప్పండి" అని ప్రొ. ఉత్సాహపడ్డాడు.

"ఏంలేదు - కప్పులనిండా కాఫీ నింపితేసరి" అని సలహాలరావు నిష్క్రమించును.

---

తనవారు జాప్యం చేసినట్లు తోచిన పక్షంలో కన్య స్వవిషయంలో ప్రమేయం కల్పించుకోవడం - శాస్త్ర సమ్మతం:-

అది, అలాఉంచు !

అసలు యింతకూ మనలోమాట—

అక్కడ, అల్లుడు, దైవాన్ని కళ్ళకు గట్టుకుని కాలక్షేపం జేస్తున్నాడు ; దీనికి వాడిసరసను ఉండాలని ముచ్చటగా ఉండదా !-

పూజకు పూసిన పుష్పం - ఎంతకాలం కొమ్మనంటి పెట్టుకుని ఉంటుంది ?-

నిన్నా నేడూ, - అమ్మాయి మొగం వేసీవేయకుండా కలకల్లాడుతూంది. దానికి అర్థమేమిటే వెర్రిదానా ?-

కాగా, - ఎవ్వరూ అనుకో పనిలేదు-

పోగా, - ఊరూ నాడూ సంబర పడు తుంది.

పట్టెడు పసుపు చిట్టెడు కుంకం పెట్టి లక్షణంగా, - పోయిరమ్మను....'

'తోడు ?-'

'వాడే! - ఆ రప్పించేవాడే !'

'అవుననుకోండి! మనం పెళ్ళి కన్యా దానం చేయాలి గదండీ !'

'అక్కరలేదండీ ! - జ్ఞాపకంలేదూ ?- అల్లుడు యింటికి వచ్చాడనే సంబరాన, - అమ్మాయిని పెళ్ళికూతురికిమల్లే సింగారించావు !- పన్నీటి కలశం పరిమళదామం పుచ్చుకుని అమ్మాయి ఆలయానికి వచ్చింది మాధవస్వామి..- చిన్నవాళ్ళను కంట జూశాడు: అదే కళ్యాణ వైభవం,

నీవు గమనించావో లేదో,- అనాటి నుంచీ, అమ్మాయి వాలకం ఏతీరున వుంది ? అత్తింటి కోడలు పుట్టింటికి చుట్టపుచూపుగా వచ్చినట్లు మెలగుతూంది కాని,- మునిపటి ఆ చిలిపితనం ఏది ?- కనుక'

'కనుక, కల్యాణ ప్రసక్తి లేదనుకోండి! వెళ్ళి అన్నమయ్యను చూసిరావడానికేం-?'

'ఏంలేదనుకో గాని,- కొండరాయడికి నిత్య సన్నిహితుడే వాడు! పరమ భాగవతుడే !- ఎదుటపడితే,- సాగిలపడక మానడు ! వానిచే మ్రొక్కించుకునే అర్హత నాకు లేదు: అదీగాక,- కనబడగానే ఒళ్ళు మరచి నేనే వానికి మ్రొక్కేనేమో ! -

మ్రొక్కవలసినదే - కాని,- వాడు,- సాక్షాత్ నా మేనల్లుడు - నాకళ్ళ యెదుట పెరిగిన పిల్లవాడు,- నావాడు - అనే మమకారం,- అల్పజ్ఞత,- ప్రతిబంధకంగావుంది! అది తొలగిననాడు,- పోయి మ్రొక్కక మానేనా ? -'

యిలా పలుకుతూండగా, మాధవయ్య కనుల ఆనందం వెల్లువకట్టింది....

--ఊరికైన పెద్ద ముత్తైదువు, మాధవయ్యకు ఓ వ్రేలువిడిచిన మేనత్త, శాంతి సోమిదేవమ్మ,- చెంగుమలుపుకొని,- గుమ్మానికి పసుపుబూసి,- పిల్లలిద్దటికీ పారాణిపెట్టింది - అన్నప్ప సోమయాజులు గారు,- నేటికి మూడోనాడు,- పంచమీ సోమవారం ప్రయాణానికి సుముహూర్తమని నిర్ణయం చేశారు :

గ్రామంలో యింటింటికీ వెళ్ళి,- తిమ్మక్క,- దీవెనలందుకుని వచ్చింది ! ఆలయంలో నిత్యోత్సవం జరిగింది !

సోమవారం! తెల తెలవారుతూంది - మాధవయ్య అనుష్ఠానం ముగించుకుని,- ఆలయంలోకి వెళ్లాడు ! సోమిదేవమ్మ అప్పటికప్పుడే స్వామిదర్శనం చేసుకుని ఎదురైంది-

'ఒరే, మాధవా!- ఇవేళేగా ప్రయాణం?'

'ఆహా ! -'

'మరి,- పిల్లదాన్ని మేనాలోనే పంపుదామా ?.... ఏం ఏర్పాటు జేసినట్టు ?....'





'మేనా లేదు, మేజువాణీలేదు !- వాడేం ఏనుగెక్కి వెళ్ళాడా,- నడచిపోలా ?- యిదీ అంతే -!'

'అంతే నంటావా ? -'

'—అనక ? - ఆ తాళ్ళపాక వారింట ఏమ్మంత్రం ఉందో గాని,- వెళ్ళినకోడలు మళ్ళీ పుట్టింటికేసి చూడదు - నా కూతురేం తక్కువ తిన్నదా ?-ఆ లక్కమ్మ కోడలుకాదా ?....'

'అరిభడవా ! - అదిట్రా సిరంధి -' ఒరేయ్ ! యిహ ఉగ్గబట్టలేక అంటున్నాను- యీతరుణానన్నా లక్కమ్మవచ్చి పిల్లదాన్ని వెంటబెట్టుకుని వెళితే....యెంత శోభాయమానంగా ఉంటుందిరా ?- ఊరిలో ఎవరిని చూసినా యిదేమాట :- యింటింటా యిదే ఆలాపన -....'

'ఏమో - వస్తుందేమో - ' యిలా అంటుండగానే మాధవయ్యకు వళ్ళు ఝల్లుమన్నది.... 'వాడి దైవం వాడికి కనిపించాడు,- కటాక్షించాడు ! యీసంగతి లోకం అంతటా తెలిసిందే - కన్నవారికి ఎందుకు తెలియకుండా ఉంటుంది - అంతటితో యీ అంకిలి తీరలేదా ?- మరి,- యింతకాలం ఎందుకు రాలేదు ? - తానన్నమాట మరచిందా ? - అలా మరువదే,- తోడబుట్టిన వాణ్ణి,- నామీద అపేక్ష తరుగదే !- పోనీ,- యిప్పుడన్నా రారాదా ?- కోడలు తరలి పోతుందని ఆ మనసుకు తోచి ఉండదా ?- వాళ్ళు సర్వమూ తెలిసినవాళ్ళేనే :- ఏమో- వస్తుందేమో !-' యిలా మనసు రాపాడింది! ఆలయంలో గంటలు మ్రోగినట్లు,- 'వస్తుందేమో - వస్తుందేమో - !' అని మౌనం మార్మ్రోగింది, మాధవయ్య, చూపు మసువు కట్టినది ! మనసు - స్వామి పుష్కరిణి, వేయి దివ్వటీల వెలుగులో,- నలుదిక్కులా క్రిక్కిరిసిన కోలాహలంలో,- మొయిలు కట్టిన కప్పురధూమం, ఆ జవనిక వెనుక, తెప్పోత్సవాన తేలుతూ తీవులు పోతూన్న మాధవస్వామి !

అలా తేజరిలుతూన్న మాధవస్వామి వారు, - శిరసు వంచిన వారందరినీ కరడు కట్టిన - చిరునవ్వుతో కటాక్షించి, బృందావన వీధులలో, రాధాదేవి మనసు కైవసము చేసికొనే కనుకలి - కలిమిని, మురళి సారించిన మోహనుడై, యమునా తీరసైకతమ్ముల అడుగు దమ్ముల చిన్నెలునిచి, -

---

● లావుపాటి లక్ష్మీపతి సన్నపాటి సత్యనారాయణతో తన గోడు చెప్పుకుని సన్నపడేందుకు ఏదైనా సలహా చెప్పమన్నాడు. సత్యనారాయణ కాసేపు ఆలోచించి బాగా కడుపునిండా తినమన్నాడు. లక్ష్మీపతి తెల్లబోయి ఎందుకన్నాడు.

"ఏంలేదు, బాగా తింటే లావెక్కుతారు. లావెక్కినకొద్దీ బద్ధకం బలుస్తుంది. బద్ధకంవల్ల పని ఆట్టే చెయ్యలేరు, దాంతో ఉద్యోగం కాస్తా వూడుతుంది. ఉద్యోగం పోతే తింటానికి తిండి వుండదు. తిండి తినకపోతే మీరు తప్పకుండా సన్నబడి పోతారు." అన్నాడు సత్యనారాయణ.

చిన్నెలువోయి, - కొన గోట గోవర్ధనమ్ము నిలిపిన కిశోరుడై, - గొల్లల - రేపల్లెవాడ నవనీతచోరుడై,- పొరాడు పాపడై,- పక పకలాడి,- న వ్వు లు పువ్వులై రాసులు దేరంగా,- పోటంత పత్రిలో కొండంత దేవుడై,- అంతలో, కను-మిక్కిలివెలుగై,- వెలిగే,- నివ్వెరిమొనవాని బిందువై,- బిందు సందోహమై,- సందోహమే నాదకోహళమై నాదబిందుకల్లోలమే కలకల లాడి,- ఆ కళ కద్దరిగా,- మసకతోచి, మబ్బుదోచి,- మబ్బంత గిరిదోచి,- గి రి క ం ద రా న, మంద్రమై,- శిఖరి కెగసి తారమై - తార కమై,- సడియై- సవ్వడియై-నినదమై- నినా దమై,- సంబరమై - సంరంభమై,- భరమై- వరమై, దహరమై లావలమై,- కేవలము తానై ....

మాధవయ్య,- అరమోడ్పు కనులతో,- స్వామివారివంక జూసి,- స్వస్థచిత్తమున-, 'అవునమ్మా ! తరుణము వచ్చింది. తానే వస్తుంది:' అనినాడు : ఆమె, మొగమంత చేసుకుని తల ఊపినది !

వచ్చింది ! ఒక కోతి !....పండుకోతి :

మాధవయ్యను చూసి, పలుకరింపుగా కిచకిచలాడి,- స్వామి సన్నిధికి పోయి,- చెవులు పట్టుకుని కుప్పిగంతులు వేసి,- సాగిలపడిలేచి,- మరల మాధవయ్యను సమీపించి,- చేతులు కట్టుకుని సరసను నిలుచున్నది - సోదెమ్మ వానివంక చోద్య ముగా చూస్తున్నది !

ఆయన వానిని చేరదీసుకొని,

ఏమయ్యా - స్వామివారు పంపినారా,- మా లక్క.మ్మ వెంట సాయముగా వచ్చి నావా,- మేలు !- తననాశ్రైపై వారికి యెంత దయ ! కోహో !- మగపెళ్ళివారుకదూ, వారు మెట్టుదిగరు !- బాలను తోడితెమ్మని బంటునంపినారు !- ఔ ను లే :- మేమే పాటివారమని !- మా కీ మ రి యా ద చాలుననుకున్నారా ?- వారు పెద్దలు,- అ ం ద రి నీ తల దన్నిన పెద్దలు ! వారికి వంకబెట్టే వారెవరు ! - పిల్లసాణ్ణి, - కాళ్ళముందు కట్టి పడేసుకున్నారు: కన్న వారినీ ఉన్నవారినీ, - మరచేట్టు చేశారు , - ఊడిగం చేయించుకుంటున్నారు: ఓ చదువు లేదు, - ఓ సంధ్యలేదు - అహర్నిశలూ, - వారిసేవే: - మెట్టుకు ప్రయోజకుణ్ణి చేశారు: సంతోషము: భుక్తికి లేకుండా జేసి,- ముక్తి కట్టబెట్టే, - దాతలు: - ఊడిగాలవారి ఊడి గాని కొక్కపడతీ - నేటికి - కావలసి వచ్చినదన్నమాట! - బాగాయె! - వారి దాసాను దాసులకే,- సుకృతము యిబ్బడిగ దక్కేనట!- అదీ - వారి కరుణేనట!- దాని కేమిగాని,- ఏమయ్యో హనుమా!- అయ్య పోయిరమ్మనంగనే చేతులూపు కొంటూ వచ్చినావు సరే!- వారు గట్టుమీది వారైతే మేము బెట్టుమీది వారము: మాకూ ఓ అచ్చటా ముచ్చటా అంటూ ఉన్నది: వారి పెట్టు పోతలకు మేమాశించక పోయినా, - వారి పెద్దరికమన్నా వారు నిలుపుకోవాలి!- మాకు మేళ తాళాలక్కరలేదు- మేజువాణీ లక్కరలేదు - అడుగులకు మడుగులొత్తే అనసరములేదు: కాని, - అయినింటిపిల్ల,- అబ్బురాన పెరిగినబాల,- ఊహలు నేర్చిన ఉత్తమురాలు: అదృష్టముకొద్దీ,- దొరికిన యిల్లాలు: యీ మాధవయ్య కూతురు! యీ విషయము రవంత అ శ్రీవారిని , గురు తుంచు కోమను: వారివి,- కళా కళలు !-





అఁ- మనపిల్లదేకదా అనుకుని,- ఎదురొచ్చి మాటా మన్ననా లేకుండా,- వారి మానాన వారుండేరేమో,- అహఁ- ఆగీర్వాణం మన దగ్గిర సోసాయించదు: పనివేళ, గట్టుదిగి రావలసినదే!- ఎదురు కావలసినదే!- 'నూ తల్లీ వచ్చినావటే' అని చేరదీసి దీవించ వలసినదే - మన ప్రబుద్ధుడికి బాల నవ్వ గించి - 'ఒరేవ్ నాయనా!- చూ సే వా రి కి ముచ్చటగా,- ఏలుకోరా!' అంటేచాలు!- మనం మరేం కోరం: ఆ పైన, వారివారి యిష్టం: వీడితోబాటు యిదీ,- చెట్లూచేమలూ పట్టి, పొదులూ బోదెలూ కడుతూ,- సత మతమౌతూ - సంబరపడుతూ - ఒకరి నొకరు కొంగున కట్టుకుంటారో,- ఎవరికి వారై,-ఎవరంతవారు వారై,-తీవులు పోతారో ఎలా చెప్పగలం? చూస్తూనే ఉన్నాంగదా? - అది స్థలమహాత్యం!- అఁ- అసలు విషయం చెప్పనేలేదు: తగుదునమ్మా అని తానొక్కడూ బుడుగూ - బుడుగూ ఎదురొస్తే చాలదా అనుకునేనేమో,- చాలదు: యధా విధిగా, దంపతులిద్దరూ రావలసిందే!- ఎన్ని యుగాలుగానో,- ఏ అరమరికా లేకుండా ఎంతో అన్యోన్యంగా కాపురం చేస్తున్న కలుపుగోలు తనం.. అ మ మే క ం తో మా అమ్మాయికి ఎదురు రావలసిందే- అదీ అడపెళ్ళివారికి వారిచ్చే గౌ ర వ ం. 'సరే ననుకో- కాని అన్నీ తెలిసి,- నీవిలా అంటే ఎలాగయ్య- అది అయ్యేపనా?-' అంటా వేమో ఆ భాగవతం మనకూ తె లు సు లేవయ్యా - !ఏమిటలా తల ఊగిస్తావ్ ? తగు సమాధానం చెప్పవేం. ఆహా!-కొండెక్కిన వాడొకడూ!-కొమ్మెక్కిన వాడొకడూ దొరికారు మాకుబంధువులు:-'





"ఈ ప్రపంచంలో కల్లా నా భార్యా రత్నమే అందాల భరిణి! ఇది నా ఒక్కడి ఉద్దేశమే కాదు, - ఆవిడకు కూడా అదే అభిప్రాయం !"

మాధవయ్య మాటలోనే పకపక నవ్వుతూ - హనుమా - ఆదికాలంవాడవు - అవతారమూర్తుల సేవించేవాడవు - యీ పామరధోరణి నీకు అర్థం కాలేదేమో - యివి,- వియ్యాలవారిదెప్పుళ్ళయ్యా !- యీ లాంఛనం మాకు ముచ్చటయ్యా!-' అంటూ హనుమ భుజంతట్టి,- 'అత్తయ్యా,- కదల వమ్మా !' అన్నాడు ! సోమిదేవమ్మ అప్పటికి తెప్పరిల్లి,- హనుమవంక,- కను- మొక్కగా చూసి,- నవ్వు మొగమైంది!....

మాధవయ్య లోగిలిలో,-

యింటికైన ఆడపడుచు,- అన్నేళ్ళకు, మరల,- తనకు తానుగా పుట్టింటికిరావడం,- ఊరికి ఉత్సవమైనది :

ఆమె, యింకా పొలిమేరల్లో ఉండగానే,- గ్రామంలో వార్తతెలిసింది ! లోగిలి దరి దాపులకు వచ్చేలోగా,- యింటిముందరా, యిల్లు నిండుగా, ఊరూ నాడూ పోగయింది! అన్నేళ్ళకుచూసినా, అందరికీ నిన్న మొన్న చూసుకున్నట్టుగానే ఉంది. ఎప్పటికళే! -

ఎప్పటి కవళికే.కోవిలకు వెళ్ళిన.ఐదువరాలు, యింటికి తిరిగివచ్చినట్టనిపించింది: ఎటో పేరంటానికి వెళ్ళి. వేళకు యిల్లు జేరుకున్న ట్లనిపించిది!

లక్కమకు యింటిమీదనే చూపు: తల వంచలేదు - తల ఎత్తలేదు! నడకలో,. తొందరలేదు - తొట్రుపాటు లేదు-గుమ్మం లోకి, ఎదురువచ్చిన ఏ ఒక్కరినీ.. పలు కరించకనూ పోలేదు - పుట్టిబుద్దెరిగినవేళ,. ఎలా మసులుకున్నదో,. నేడూ అంతే - ఊరికి తాను కొత్తకాదు. తనకా ఊరు క్రొత్తకాదు - అందరికీ,....అలా అనిపించింది!

గుమ్మంలో వదినెగారు నిలుచున్నది.

చేతనున్న పండూఫలం ఆమె చేతిలో పెట్టింది -

నూద్దగిరికిపోయి, కాళ్ళు కడుక్కుని,. కుచ్చెళ్ళొత్తిపట్టి,. పడమటింట్లోకివచ్చింది, పెద్ద పీట వాల్చుకుని కూర్చుంది —

తి మ్మ క్క.. అ క్క మ్మా.. ఎదుట పడ్డారు!

తోడ పెళ్ళికూతుళ్ళు—

అప్పుడే తరిమెనబట్టిన తులసిపూసల వలె! పులికాపుచేసిన ఉత్సవ విగ్రహముల వలె,. సీరెండలో వన్నెలుదేరే పూర్ణకుంభముల వలె,. పూజకైన పూమాలలవలె - తోచినారు! లక్కమ వారివంకచూసింది! తల ఊపింది!

చిరుసిగ్గు, చిడిముడిపాటు, - భయం, సంభ్రమం, ఆపేక్ష, ఆప్యాయత: బాలల కన్నుల తొణికిసలాడినవి:

లక్కమ్మ నవ్వుతూనే చేతులుజాపింది- చేరదీసింది:

'తిమ్మక్కా: మొన్న పాడ్యమినాడు,. గంగవ్వకు.. నెల పొడుపు పూజకని పోతిని గదా:

దారిలోనే హనుమ ఎదురైనాడు:

కిచకిచ లాడినాడు:

వారు పంపినారట:

అన్నమయ్య యిక ఒంటరిగా ఉండ రాదని,- వారి ఆదేశమట: అయ్య సేవ కొకరూ అమ్మసేవల కొకరూ అవసరమట: నేను కదలిపోయి,. కోడళ్ళను తోడుకొని రావలెనట: గంగవ్వ., తానై కదలి సాయం వచ్చేనట: దారికాపు గంగవ్వేనట: మహా ప్రసాద మనుకున్నాను:

గంగవ్వను పలుకరించినాను:

హనుమ,. అవ్వకు ప్రదక్షిణముచేసి,. కొమ్మ కెగసినాడు: కొమ్మ ఫెళ్ళుమన్నది: మబ్బులేక ఉరుమురిమినది: చెట్టూ గలగల లా డి న ది: అవ్వ కదలినట్లనిపించింది: మూడడుగులు వెనుకకువేసి,. 'అవ్వా సకినె మిదా!' అన్నాను:తూర్పున మబ్బు పట్టింది: దక్షిణాన మెరుపు మెరిసింది: గాలి కదలింది: గగనం విచ్చుకుంది: కానరాని పిడుగువట్టి, కనుమేర వెలుగేసి, అమ్మ వారి మాను - నెరియయిచ్చి,. ఆ చెంపకీ చెంపకూ వాలిపోయింది: అ పాటులోనే,. గంగవ్వ మట్టసం కలుక్కున విచ్చుకుంది తల్లి: ఆయన పలుకే అవ్వపలికింది తల్లి:

తాళ్ళ పాకలో, అవ్వకు, సాగనంపు సంబరాలు జరుగుతున్నాయి: ఐదువరాళ్లూ,. కన్నెపడుచులూ,. చెంతనోచుక్కా, — నొష్టనోచుక్కా పెట్టుకుని, పాపిట కుంకం అద్దుకొని,. అరచేతుల గోరింట వన్నెతో.. కాళ్ళ పారాణితో,. కుసుంబావన్నె కోకలు గట్టి,. కీలుగంటు వేసుకుని, సిగలో మందారాలూ తలకో మ్రొక్కుగా మొక్కికే తర తరాలకు తరగని దీవెనలిస్తూ,. అష్టదళ పద్మ వాహనాన అవ్వ, కొలువుదీరి.. మన కోసం వేచియున్నదమ్మా!- ...'

వదినెగారు,. యీ పలుకులు అల్లంత దూరమున నిలుచుని ఆలకించింది:లక్కమ్మ అప్పుడామెవంక జూసి అన్నది గదా,—

'విన్నావు కదా వదినా: యిందులో మన ప్రమేయంలేదు: .... యిక నీదే ఆలస్యం- పిల్లలకు బొట్టుపెట్టి·వడిబియ్యంకట్టు-'

ఆవిడకు,- ఆనందమంత దుః ఖ ం వచ్చింది:

అంతలో,. ఎవరో కళ్లు తుడిచి వెన్ను తట్టి నట్టనిపించింది: ఆవిడ గే రు కు ని, యింతకాలం,. మీ యింటి కోడలినైనా,. యింకా అజ్ఞానురాలినే వదినా,.' అని కలత లేని నవ్వు నవ్వింది:....

మాధవయ్య,. తిరిగి వచ్చాడు:

హనుమ గుమ్మంలోనే ఆగిపోయినాడు:

పిల్లలిద్దరూ ఎదుటికి వచ్చినారు:

వారివంకచూసి,. ఆ చూపులోనే చెల్లెలి వంక చూసినాడు: యిద్దరికీ నవ్వుమొగాలు:

పిల్లలిద్దరూ,. ఒకరు పన్నీరు కలశం ఒకరు పరిమళ దామం అందుకున్నారు: తండ్రి 'మాధవా! నీ కృప!' అని స్మరించినాడు:

పిల్లలు కదలినారు

వెంట పెద్దలందరూ:

హనుమ ముందు నడిచినాడు:

ఊరుదాటి పోయే ముందు.

పొలిమేరలో,.

లక్కమ్మ - అగకుండానే - 'అన్నా' అన్నది - 'అమ్మా' అన్నాడు:

అందరూ ఆగిపోయినారు:

వారు, ముందుకు సాగినారు:

—తాళ్ళపాక పొలిమేరల్లోకి-

గంగవ్వ ఊరేగుతూ వచ్చింది:

ఐదువరాళ్లూ, కన్నెపడుచులూ అందరూ వెంట వచ్చారు: ల క్క మ్మ గంగవ్వకు హారతిపట్టి,— పిల్లల కన్నుల క ద్దిం ది: పేరంటాండ్రందరూ- అవ్వమీద కుంకుమా పసుపూచల్లి,. చేత నుంచుకున్న చెంగల్వలు,. ముందుంచినారు: హనుమ,. ఆ కుంకుమలో తానూ వాలాడి,. ముద్దమందార మల్లెముందు నడచాడు:

సాళువ నరసింహరాయలు: దారి పొడుగునా చలువ పందిళ్లు వేయించినాడు: దాటల పరిమళోదకం చల్లించి పూలుపరిపించినాడు: ఊరూరా,. అవ్వ ఒక్కక్షణం నిలిచింది: నిలిచిన పట్టున: ఊరివాళ్లు,. ఎన్న డూ కొలుచుకునేందుకు దేవర శిలలు నిలుపుకున్నారు: అలాసాగి పోయినారు....

---

● భర్త: "పోనీ హిస్టరీ పేపరన్నా బాగా రాశాడా నీ సుపుత్రుడు?"
భార్య: "అదిమాత్రం ఎట్లారాస్తాడండీ, వాడు పుట్టకముందు ఎప్పుడో జరిగిన వాటిని గురించి అడిగితే?"

అక్కడ అన్నమయ్య....

కప్పురపుటనటి తోటలో మొకాలిబంటి పరిమళోదకంలో.. ఒడ్డున నడిచేవాడు.. తన నీడచూసి.. తానే ఎందుకో బెదరినాడు. 'ఏమో'అనిపించింది. చెక్కలద్దుకున్నాడు! నులివెచ్చదనం తోచింది! కనుల నీరు క్రమ్మింది! తమకం హెచ్చింది. 'ఇదేమో' అనుకున్నాడు! తులసి వనం చేరుకున్నాడు! అక్కడనూ కాలు నిలువలేదు! సంపంగి వనం చేరుకున్నాడు! అక్కడ మనసే నిలువలేదు - యిది కాదనుకుని.. ఎటో నడచిపోతున్నాడు! కోతిమూక. ఎదురైంది! అన్నమయ్య ఆగలేదు! వేయి గొంతుల ఒక్కటే కిచ కిచ-చుట్టుకుని కదలనీయలేదు-కోతులు చేతులు పట్టుకున్నవి.. ముందుకు లాగినవి; కదలడే!-

ఎవరో అవ్వ.. అవ్వవెంట ఎవరో ఆయన: యీచోద్యం చూడటానికి ఆగినట్లు ఆగినారు

అవ్వ. చూసి - చూసి నవ్వింది.

'పుణ్యానికి లాగుతూంటే-పుణ్యాత్ముడు కదలడేం-' అంది.

'ప్రాప్తం:' అన్నాడాయన!

'పాపం! చెప్పు చేతలక్కరలేకుండనే.. యింతకాలం తన వెంటనే.. పువ్వులూ పత్రి కాయించి సేవల కందించెనే! తీర్థాని కన్నా ఆసపడలేదే! ఏమో.. వాటి ముచ్చటేమో! రమ్మంటే - ఎందుకలా పెనుగులాడతాడు?-

'యింగితం లేక!'

'కాదు! చెప్పేవారు చెప్పక!-'

'చెప్పినా వినక-'

'వినే తీరున వినిపించక!'

'అనగా-'

'చెవులు పట్టి.. చిన్నవాడా లొంగిరారా అనక'

— ఒకకోతి అన్నమయ్య భుజానికి ఎగిరి.. చెవిపట్టుకుని కిచకిచ లాడింది!

అవ్వ.. ఆయన కలిసి నవ్వారు:

'యిక దారికివచ్చినట్టే' అనుకుంటూ ముందుకు సాగిపోయినారు: అన్నమయ్యకు తెలియనిది తెలిసినట్లనిపించింది! నవ్వుకుంటూ ముందు అడుగువేశాడు:

అవ్వా ఆయనా.. నడుస్తూన్నారు!

దారివెంట - కోతిమూక.. పూలరాశి పోసింది; నేలపాదము లాననంత సుతారంగా.. వడివడిగా.. అడుగులు గోచరిస్తున్నాయి!....

— దారి మలగింది! ఊరు విచ్చుకుంది!

హనుమ వైదొలగినాడు:

అవ్వా.. ఆయనా.. ముందుకు వచ్చినారు:

'రావే మాతల్లీ' అని.. పిల్లలను చేరదీసుకున్నారు!

అన్నమయ్య అక్కడకు చేరుకున్నాడు:

అన్నమయ్యను చూసి, ఆయననుజూసి, అవ్వ అన్నది కదా..

'పగడమంత సత్యంలో.. ముత్తెమంత తేజం పుట్టంగా.. నీలమంత గగనంలో నివ్వరిమొన తళుకులో.. మెలకువ తెలిసిన వారికి, రోదసి యిల్లాలైతే.. తనదెక్కడో.. తానక్కడే.'

ఆయన నవ్వినాడు!

ఆనవ్వు అన్నమయ్యకు ఆనందమిచ్చినది.





తిమ్మక్క.. పన్నీటికలశం అన్నమయ్యకు అందించినది!

అన్నమయ్య.. అక్కమచేతి పరిమళ దామం చూసి. శిరసు వంచాడు; అక్కమ ఆ దామం. గంగివ్వ సన్నిధిని ఉంచింది:

అవ్వా.. ఆయనా.. వారికి కనిపించలేదు!

అక్కమ శిరస్సువంచి.. నాకు 'సెలవా!' అన్నది! అన్నమయ్యకు.. అర్థంకాలేదు!

'మందారవనంలో వెలసిన అవ్వ.. కొలువుకు రప్పించుకున్నది: ఆ సేవకు నేను బోయేను! తిమ్మక్క మీసేవ కమరేను!'

అక్కమ్మ వెనుదిరిగింది!

హనుమ. ఎటునుండో వచ్చి.. తంబుర దండే చిరతలూ.. అన్నమయ్యకు అందించినాడు! చిరుతలు చేతనందుకొనగానే.. ఆ గల గలలో.. కృష్ణమాచార్యుని.. గానం వినిపించినట్లయింది - తంబుర మీటంగనే పలుకొచ్చింది! పలుకులో పలుకుగా. తిమ్మక్క.. ఏమని విన్నవించుకున్నదంటేను—

నాతనువే నీతలవాకిటిమంగళతోరణము!
నాహృదయమే పూర్ణకుంభము!
నిను జూచిన చూపే నిత్యనివాళి.
పలికిన పలుకే - పాదపూజ:
తలచిన తలపే నివేదన -
నిలచిన నిలచే..కదలిన కదలే నీడనయ్య
నీ సన్నిధిలో వెలుగు రేకనయ్య..
నీ కెత్తిన కప్పుర ఆరతినయ్య.
నిను కమ్మిన పరిమళ ధూపమునయ్య.
నీపాదతీర్థమునయ్య - నీ ప్రసాదమునయ్య -
శివము నీవయ్య - కైవల్యమేనీవయ్య -
నిన్ను గొల్చినవారి పుణ్యఫల రూపాన..
నీసేవకైపుట్టి నీ సేవకై పెరిగి. నిన్నెరిగి బుద్ధెరిగి.. నీకు చేరువై. సేవకినైన.. నన్ను నీ:వ్య చిత్తమున చేర్చుకోవయ్య.. చెంగల్వరాయ!—

సంజెవేళ.. అన్నమయ్యా తిమ్మక్కా కొండకు జేరుకున్నారు! స్వామి ప్రాంగణములో.. వేయి దీపములు వెలిగినవి! వేనకు వేలు గొంతులు గోవింద కోలాహలములో నున్నవి:

వెన్నెలలో.. తులసీవనములో.. వారున్నారు!

'మేనమామ కూతురా.. మేనరికపు వావిదాన. నిలువనీడలేనివాని.. యిల్లాలా యిటురావే -!' అన్నాడు అన్నమయ్య! తిమ్మక్క నవ్వుకున్నది: తాను వెంట తెచ్చిన గ్రంథము అందించినది! పరిశీలించినాడు! కన్నుల కొత్తుకున్నాడు!

హనుమ.. పాలదుత్త తెచ్చినది!
మరో హనుమ పండ్లు తెచ్చినది!
మరో కిచ కిచ పూలు తెచ్చినది!

ఆ పూవులందుకుని.. సిగలో తురుముకుని—

'మాడుపూరిలో ఆడపడుచు, మాధవుని సేవించగా.. పుణ్యాన పుట్టిన మణిపూస.. మేనమామ యింటికొచ్చి మేనరికం.. కుదుర్చుకుని.. తన వారికి దూరమైన, తామర కమలమ్మా -దూరాభారం వచ్చి.. తోచినసేవలుజేసి.. కొండల కోనేటివాని గుత్తగొన్న. బ్రహ్మచారీ: ఆరగించేమా!- అవ్వాని సేవలో అదమరచేమా-' అన్నది!

గగనాన వెలుగు శిఖరానికొచ్చింది:

శిఖరాన వెలుగులో. గంగవ్వ. కన్ను మెరసింది!

అన్నమయ్య - సంకీర్తము కోనేటిరాయని కమ్ముకున్నది. □□□

[ సమాప్తం ]